నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
సోమవారం | జనవరి 20, 2025 | www.navatelangana.com

లక్షా 80 వేల విలువైన గుట్కా పట్టివేత

నవతెలంగాణ-మద్నూర్

నిషేధిత గుట్కాలు అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని మద్నూర్ ఎస్సై విజయ్ కొండ హెచ్చరించారు. మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా బిచ్కుంద నుంచి మద్నూర్ కు వాహనంలో తరలిస్తున్న ఒక్క లక్ష 80 వేల విలువగల గుట్కాలను పట్టుకున్నారు. తరలిస్తున్న శ్రీకాంత్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

డోంగ్లి మండలం లింబూర్ గ్రామం సమీపంలో రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నామని ఎస్సై విజయ్ కొండ తెలిపారు. మంజీరా నది నుంచి అక్రమంగా ఇసుకను తీసుకొని తరలిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వాహనాలను పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు.

మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటు



నవతెలంగాణ-కామారెడ్డి

మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజిస్ట్ అసోసియేషన్ కామారెడ్డి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం కామారెడ్డి పట్టణ పద్మశాలి సంఘం లో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా బొమ్మరి భూమేష్ , అధ్యక్షులుగా కందడి సాయి రెడ్డి, కార్యదర్శిగా బల్ల సంతోష్ కుమార్, కోశాధికారిగా ఎంకే కుదుబుద్దీన్, ఉపాధ్యక్షులుగా ల్యాబ్ శ్రీధర్, పి వెంకట్ రాజా గౌడ్, సహాయ కార్యదర్శిగా చందుపట్ల నగేష్, సీనియర్ టెక్నీషియన్ అంకం కృష్ణ, హరి, తోటి ల్యాబ్ టెక్నీషియన్స్ బల్ల సురేష్ కుమార్, ఏనుగు మధుసూదన్ రెడ్డి, లక్ష్మిపతి, నరేందర్, షేక్ అమీర్ పాష, ఆరిఫ్, మదన్మోహన్, భారతి, రజిత మొదలగు టెక్నీషియన్ లు పాల్గొన్నారు.

అంకితభావంతో పథకాల అమలు

- ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ
- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలి
- ఉమ్మడి జిల్లా సమన్వయ సమావేశంలో ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణరావు
- పాత పథకాలను యధాతథంగా కొనసాగిస్తామని వెల్లడి



సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణరావు.. వేదికపై షబ్బీర్అలీతో పాటు ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, మేయర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పేద, బడుగు, బలహీనవర్గాలకు బాసటగా నిలువాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ది చేకూరేలా అంకిత భావంతో కృషి చేయాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులకు సూచించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఆహార భద్రత రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలపై జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి ఆదివారం నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఉమ్మడి జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ కవిత, శాసన సభ్యులు సుదర్శన్ రెడ్డి, డాక్టర్ భూపతి రెడ్డి, లక్ష్మీకాంత్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, ధన్పాల్ సూర్యనారాయణ, పైడి రాకేష్ రెడ్డి, వెంకటరమణా రెడ్డి, రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ, నగర మేయర్ దండు నీతూ కిరణ్, కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ ఇందుప్రియ తదితులు పాల్గొన్నారు.

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలలో పై నాలుగు పథకాలను అమలు చేయడానికి జిల్లా యంత్రాంగాల ఆధ్వర్యంలో చేపడుతున్న చర్యల గురించి కలెక్టర్లు రాజీవ్ గాంధీ హనుమంతు, ఆశిష్ సంగ్వాన్ లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ లక్ష్యాలు, ప్రాధామ్యాలను ఇంచార్జ్ మంత్రి జూపల్లి ప్రస్తావిస్తూ.. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా అర్హులందరికీ సంక్షేమ పథకాల ద్వారా మేలు చేకూరేలా చూడాలని అధికారులకు హితవు పలికారు. అర్హత కలిగిన ఏ ఒక్కరు కూడా మినహాయించబడకూడదని, అదే సమయంలో అనర్హులకు లబ్ధిదారుల జాబితాలో చోటు దక్కకుండా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఎలాంటి విమర్శలు, తప్పిదాలకు తావులేకుండా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరగాలన్నారు. ఎక్కడైనా చిన్నచిన్న లోపాలు, సాంకేతికపరమైన ఇబ్బందులు ఉంటే వాటిని సవరించుకోవాలని సూచించారు. ఇప్పటికే అమలులో ఉన్న పాత సంక్షేమ పథకాలను యధాతథంగా కొనసాగిస్తామని, ఏ ఒక్క పథకాన్ని కూడా ప్రభుత్వం ఎత్తివేయబోదని మంత్రి స్పష్టం చేశారు. పాత పథకాలకు అదనంగా మరో నాలుగు కొత్త పథకాలను ఈ నెల 26 నుండి అమలు చేయనుందని వెల్లడించారు.

తమకు సంక్షేమ పథకాలు రాలేదని ఏ ఒక్కరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులైన ప్రతి ఒక్కరికి, ప్రతి కుటుంబానికి తప్పనిసరిగా ప్రయోజనం చేకూరేలా చూస్తామని, ఎవరికీ అన్యాయం జరగనివ్వబోమని భరోసా కల్పించారు. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇల్లు తదితర పథకాలు నిరంతర ప్రక్రియగా అమలు చేస్తామని అన్నారు. ఈ నెల 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామ సభలలో అర్హులైన వారు ఆయా పథకాల కోసం దరఖాస్తులు అందించవచ్చని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో రైతుబంధు పథకం కింద సాగులో లేని భూములకు కూడా ఆర్థిక సాయం అందించడం వల్ల సుమారు 24 వేల కోట్ల రూపాయల ప్రజాధనం వృధా అయ్యిందనే విమర్శలు ఉన్నాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రజల కష్టార్జితంతో కూడిన ప్రతి పైసా సద్వినియోగం కావాలనే ఉద్దేశ్యంతో తమ ప్రభుత్వం సాగుకు యోగ్యం కానీ భూములను రైతు భరోసా నుండి మినహాయిస్తూ, సాగులో ఉన్న భూములకు సంబంధించిన ప్రతి రైతుకు ఎకరాకు 12 వేల రూపాయల చొప్పున పెట్టుబడి సాయం అందించాలని సంకల్పించిందన్నారు. అంతేకాకుండా సాగు భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు సైతం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రెండు విడతలలో 12 వేల చొప్పున ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు.

కాగా, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా అవసరమైతే ఆయా పథకాల నిబంధనలు సడలించాలని ఎమ్మెల్సీ కవితతో పాటు ఎమ్మెల్యేలు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

ఈ సమన్వయ సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, ఐడిసిఎంఎస్ చైర్మన్ తారాచంద్, నుడా చైర్మన్ కేశ వేణు, నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్లు వి.విక్టర్, శ్రీనివాస్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ తో పాటు ఉమ్మడి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కమిటీలుగా.. ఇందిరమ్మ ఇండ్ల కమిటీలు

అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా

ఇందిరమ్మ ఇండ్ల కమిటీలు కాంగ్రెస్ కమిటీలుగా ఉన్నాయని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. ఆదివారం ప్రభుత్వ సంక్షేమ పథకాలపై జిల్లా సమన్వయ సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్బన్ నియోజకవర్గంలో గత 11 సంవత్సరాల నుంచి ఒక్క ఇళ్ళు కూడా ఇవ్వలేదని తెలిపారు. నాగారంలో కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు శిథిలావస్థలో ఉన్నాయన్నారు. హౌసింగ్ మంత్రి పొంగులేటి దసరాకే ఇండ్లు ఇస్తామని చెప్పారని, సంక్రాంతి పండగ అయిపోయినా మోక్షం లేదన్నారు. వాటి మరమ్మత్తులకు సరిపడా నిధులు కేటాయించి జీఓకి వ్యతిరేకంగా జరిగిన జాబితాను రద్దు చేసి అర్హులైన జాబితాను జీఓ ప్రకారం ఎంపిక చేయాలని తెలిపారు. కొత్త రేషన్ కార్డులు జారీ ప్రక్రియలో ప్రభుత్వం ఆంక్షల పేరుతో కోతలు పెడుతుందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి పథకానికి రేషన్ కార్డు ప్రామాణికంగా తీసుకుంటారు కాబట్టి కోతలు పెట్టి గరిబోళ్ల కడుపు కొట్టొద్దని మంత్రిని కోరారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు రేషన్ కార్డులు కట్ చేయకుండా కొత్తవారికి కూడా జారీ చేయాలని సూచించారు. ఫోర్ వీలర్ వాహనాదారులకు రేషన్ తొలగించడం, కొత్తవి జారి చేసే విషయంలో సొంత క్యాబ్, ఆటో నడుపుకునే వారిని దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులకు, మీసేవ ద్వారా వచ్చిన దరఖాస్తులకు ప్రభుత్వం నుంచి ఎంపిక చేసి వచ్చిన జాబితాకు చాలా తేడా ఉందన్నారు. దీని ద్వారా అర్హులైన లబ్దిదారులు నష్టపోయే అవకాశం ఉందని తెలిపారు.



సమావేశమైన రైతులు

మాస్టర్‌ప్లాన్ జీవోను ఎత్తివేయాలి

- ఎమ్మెల్యే ఎందుకు మౌనం వహిస్తున్నారు..? రైతుల ప్రశ్న
- మాటల్లో కాదు.. చేతల్లో పనితనం చూపించాలని డిమాండ్

నవతెలంగాణ-సదాశివనగర్

కామారెడ్డి మాస్టర్ ప్లాన్ జీవో నుండి సర్వే నెంబర్లను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ఆదివారం అడ్లూరు ఎల్లారెడ్డి లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ ను తీసుకు వస్తే నేటి ప్రభుత్వం ఎన్నికల ముందు రద్దు చేస్తానని హామీ ఇచ్చి ఏడాదిన్నర గడుస్తున్న మాస్టర్ ప్లాన్ లోని ఇండస్ట్రియల్, గ్రీన్ జోన్లను ఎత్తివేయకపోవడం బాధాకరమన్నారు. ఎన్నికల్లో ఉద్యమాన్ని ముందుండి నడిపిన రమణారెడ్డి ఎందుకు మౌనం వహిస్తున్నారని... మాస్టర్ ప్లాన్ రద్దు అయితే జీవో కాపీని రైతులకు అందజేయాలన్నారు. మాటల ద్వారా ఇచ్చే హామీలు కాదని జీవో రద్దుచేసి రైతులకు ఇచ్చిన మాటలను నిలబెట్టుకోవాలి అన్నారు. రైతులపై ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే రాబోయే మున్సిపల్, స్థానిక ఎన్నికల్లో రైతుల సత్తాను చాటి చూపిస్తామన్నారు. పచ్చని పంటల్లో చిచ్చుపడితే చూస్తూ ఊరుకోమని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాస్టర్ ప్లాన్ జీవోను తక్షణమే రద్దుచేసి రైతులను రైతుగా బతకనివ్వాలన్నారు. 1195 ఎకరాల్లో ఇండస్ట్రియల్ జోన్‌ను ఏర్పాటు చేసి అసెంబ్లీలో ఎమ్మెల్యేలు ఏనాడు మాట్లాడకపోవడం సిగ్గుచేటు అన్నారు. మాస్టర్ ప్లాన్‌పై మూడు పార్టీలు తమ ద్వంద వైఖరిని మానుకోవాలని డిమాండ్ చేశారు.

చెట్లపొదల్లో ఆడ శిశువు



నవతెలంగాణ-మాక్లూర్

అప్పుడే పుట్టిన ఆడశిశువు చెట్లపొదల్లో లభ్యమైంది. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలంలోని చిక్లిగ్రామ శివారులో ఆదివారం తెల్లవారు జామున వెలుగుజూసింది. ఎస్ఐ రాజశేఖర్ వివరాల ప్రకారం.. చిక్లి గ్రామ శివారులో తెల్లవారు జాము అందాజ నాలుగు గంటలకు రోడ్డు పక్కన చెట్లపొదల్లో అప్పుడే పుట్టిన ఆడ శిశువును గుర్తుతెలియని వ్యక్తులు వదలిపెట్టి వెళ్లిపోయారు. గ్రామస్తులు, వాకింగ్‌కు పోయేవారికి శిశువు ఏడుపు వినిపించగా.. చూసి గ్రామస్తులకు, జీపీ కార్యదర్శికి, పోలీసులకు సమాచారం అందజేశారు. శిశువును చికిత్స నిమిత్తం అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు ద్వారా నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి అంబులెన్స్ ద్వారా పంపించారు. ఐసీడీఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కాగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు.

విషాదంగా మారిన సరద

- చేపల వేటకు వెళ్లి లక్ష్మికాలువలో పడి యువకుడు మృతి

నవతెలంగాణ-ముప్కాల్



సరదాగా చేపలు పట్టేందుకు వెళ్లిన యువకుడు.. ప్రమాదవశాత్తు కాలువలో కొట్టుకుపోయి మృతిచెందాడు. ఈ ఘటన ముప్కాల్ మండలంలో లక్ష్మికాలువ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన అనికేశి తేజ (19), అనికేశి రిషి, అవాల అభినవ్ ముగ్గురు మిత్రులు. చేపలు పట్టేందుకు లక్ష్మీ కాలువలోకి దిగారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో అనికేశి తేజ 100 మీటర్ల దూరంగా కొట్టుకపోవడంతో మృతి చెందారు. మరో ఇద్దరు స్నేహితులైన అనికేశి రిషి, అవాల అభినవ్ లు ప్రాణాలతో బయటపడ్డారు. మృతి చెందిన అనికేశి తేజ ఆర్మూర్ లోని క్షత్రియ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మృతుడి తండ్రి అనికేశి సాయందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.రజినీకాంత్ తెలిపారు. తేజ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చద్మల్‌తండాలో నకిలీ 500 రూపాయల దొంగ నోట్లు కలకలం



స్థానికులు గుర్తించిన నకిలీ నోట్లు

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని చద్మల్ తండాలో 500 రూపాయల దొంగ నోట్ల కట్టలు కలకలం రేపాయి. తండావాసుల సమాచారం ప్రకారం చద్మల్ తండాలో సంక్రాంతి సందర్భంగా లక్ష్మమ్మ దేవి ఆలయ వారోత్సవాలు సందర్భంగా లక్ష్మమ్మ దేవి జాతర మూడు రోజులుగా వైభవంగా పాండవ వాసులు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ప్రతి ఏడాది ఆలయానికి సంబంధించిన డబ్బులు తండా వాసులు వడ్డీకి తీసుకుని జాతర ముందు మళ్ళీ ఆలయ కమిటీ వారికి తిరిగి చెల్లిస్తారు. ఈ ఏడాది కూడా తండా వాసులు వడ్డీకి తీసుకున్న డబ్బులు కమిటీ వారికి తిరిగి చెల్లించారు. జాతర అనంతరం మిగిలిన డబ్బులు మళ్ళీ తండా వాసులకు ఆలయ కమిటీ అప్పుగా ఇస్తుంది. ఇలా ఇచ్చిన 500 రూపాయల నోట్ల కట్టలలో దొంగ నోట్లు రావడంతో నివ్వెరపోయిన తండా వాసులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఫిర్యాదు అందుకున్న పోలీసులు ఆలయ కమిటీ వారి దగ్గర ఎవరెవరు అప్పు తీసుకున్నారు. ఎవరెవరు చెల్లించారు. ఎంతమంది అప్పు తీసుకున్నారు వారి వివరాలను ఆలయ కమిటీ సభ్యులను పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. గ్రామానికి చెందిన ఓ నాయకుడు చెలామణి చేసినట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

రేపు ఆశాల పాదయాత్ర

- జయప్రదం చేయాలి : సీఐటీయూ పిలుపు



మాట్లాడుతున్న నూర్జహాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్/కామారెడ్డి

ఆశా వర్కర్ల సమస్యలు, డిమాండ్‌లు నెరవేర్చాలని కోరుతూ రేపు(మంగళవారం) తలపెట్టిన పాదయాత్రను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ పిలుపునిచ్చారు. ఆదివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆశా వర్కర్లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ.. ఆశ వర్కర్ల సమస్యలపైన 21న పాదయాత్ర బోర్గం బ్రిడ్జి నుంచి ధర్నాచౌక్ వరకు పాదయాత్ర చేపట్టనున్నట్టు తెలిపారు. పాదయాత్రకు జిల్లావ్యాప్తంగా ఆశ వర్కర్లు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఆశాల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని తెలిపారు. బిఆర్ఎస్ కంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మెరుగైన సౌకర్యాలు కల్పిస్తుందని, ఆశాలకు వేతనాలు పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిందన్నారు. ఆశాల ఓట్లతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది కానీ ఆశాల సమస్యలు మాత్రం నేటికీ పరిష్కారం కాలేదని తెలిపారు. ఈ కాలంలో ఆశాలకు ఫిక్సిడ్ వేతనం రూ.18వేలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరంచాలని కోరుతూ జిల్లా ఉన్నతాధికారులకు, జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్యేలకు, మంత్రులకు ఆశాలు అనేకసార్లు వినతిపత్రాల ద్వారా విజ్ఞప్తులు చేశారని గుర్తుచేశారు. ఈ పాదయాత్రను ఆశ వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో స్వప్న, శోభ, రేణుక, రాధా, గంగామణి, లలిత, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవీందర్

10 కిలోమీటర్ల పాదయాత్ర

బాన్సువా(కామారెడ్డి) : బాన్సువాడ పట్టణ కేంద్రంలో సీఐటీయూ కార్యాలయంలో ఆశ వర్కర్ల సమస్యలపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జే రవీందర్ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 21న (రేపు) 10 కిలోమీటర్లు పాదయాత్రతో కలెక్టర్ కార్యాలయం వరకు ఉంటుందనీ, కామారెడ్డి జిల్లాలోని 22 మండలాల్లో ఉన్న ఆశ వర్కర్లందరూ ఈ కార్యక్రమానికి తరలిరావాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని, ఫిక్స్ వేతనం 18,000 ఇవ్వాలనీ, ఉద్యోగ భద్రత కల్పించాలనీ, పీఎఫ్, ఈఎస్ఐ తదితర సౌకర్యాలతో పాటు పెండింగ్ బిల్లులు వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆశ వర్కర్స్ బాన్సువాడ నాయకురాలు లావణ్య, రజిత, పద్మ, వరలక్ష్మి, సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

'కూల్'గా మత్తు పదార్థాల దందా..?

బయటకో వ్యాపారం.. లోపల మరో దందా

- అర్ధరాత్రి వేళ గుట్టుగా పట్టణానికి మత్తు పదార్థాల సరఫరా
- విచ్చలవిడిగా లభిస్తుండటంతో మత్తు పదార్థాలకు బానిసవుతున్న యువత
- పోలీసుల నిఘాతో అడ్డుకట్టపడేనా..?

నవతెలంగాణ-భిక్కనూర్



'కూల్' గా ఎవరి కంటా పడకుండా మత్తు పదార్థాల దందా భిక్కనూరు మండలంలో జోరుగా సాగుతుందని ప్రచారం. ఎవరికీ అనుమానం రాకుండా బయట 'కూల్' దందా నిర్వహిస్తుండగా.. లోపల మాత్రం మత్తు పదార్థాల దందా గుట్టు చప్పుడు కాకుండా నడిపిస్తున్నట్టు సమాచారం. గత కొంతకాలంగా యువతకు మత్తు పదార్థాలు ఎక్కడినుండి వస్తుందో తెలియదు కానీ ధూమపానంలో మత్తు పదార్థాలు కలుపుకొని టీ పాయింట్లు, పాన్ కోకాలు, కిరాణా షాపుల వద్ద యదేచ్ఛగా ధూమపానం సేవిస్తున్నారు. ఒకవైపు పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేసి మత్తు పదార్థాలు, మారకద్రవ్యాలు నివారణకు అడ్డుకట్ట వేయాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నా వారి కళ్ళు గప్పి అర్ధరాత్రి సమయంలో పట్టణంలోనికి సరఫరా చేస్తున్నట్లు సమాచారం.

ప్రస్తుతం కాలంలో ఎవరిని చూసినా పొట్టకూటి కోసం ఏదో ఒక పనిచేసుకుంటున్నారులే అనుకుంటే పొరపాటే. చేస్తున్నది చిన్న దందాలే అయినా ఆ చిన్న దందాల వెనక భారీ మొత్తంలో మత్తు పదార్థాలు సరఫరా చేస్తూ ఎవరి కంటా పడకుండా దందాలు కొనసాగిస్తున్నట్లు వినికిడి. నిత్యం పోలీసులు వాహనాల తనిఖీలు, మద్యం సేవించిన వారికి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేస్తున్నారే కానీ దారితప్పి వస్తున్న మత్తు పదార్థాల పై నిఘా వేస్తున్నారా లేదా తెలియాల్సి ఉంది. మత్తు పదార్థా లకు బానిసవడంలో ఎక్కువ శాతం యువకులే ఉండడం గమనార్హం.

మత్తుకు బానిస అవుతున్న యువతకు మత్తు పదార్థాలను సరఫరా చేస్తూ దందాలు సాగించ డంలో ఆరితేరిపో యారు. కూల్‌గా తమ దందా కొనసాగిస్తూనే ఏమీ తెలియనట్లు జనసంద్రంలో కలిసిపోయి అమాయకుల్లా వ్యవహరిస్తూ ఇతర ప్రాంతాల నుండి మత్తు పదార్థాలను తీసుకు వస్తున్నట్లు సమాచారం. పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేసి యువతను మత్తు పదార్థాలకు బానిస చేస్తు తమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులను పట్టుకొని శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు, యువకుల తల్లిదండ్రులు కోరుచున్నారు.

ఐక్య ఉద్యమాలతోనే సమస్యలకు పరిష్కారం

- కార్మిక కర్షక ఐక్యత ర్యాలీలో రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్



ర్యాలీ చేపట్టి నినాదాలు చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఐక్య ఉద్యమాలతోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ అన్నారు. కార్మిక కర్షక పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. 1982లో తమిళనాడులో రైతాంగం హక్కుల కోసం జరిగిన కార్మిక, కర్షక రైతాంగ ప్రదర్శన పైన ఆనాటి ప్రభుత్వం విచక్షణారహితంగా జరిపిన కాల్పులలో 10 మంది నాయకులు అక్కడికక్కడే చనిపోయారు. వారిలో నలుగురు వ్యవసాయ కార్మికులు, ముగ్గురు రైతులు, ముగ్గురు కార్మికులు ఉన్నారని వారి పోరాటాన్ని స్మరించుకుంటూ జనవరి 19న మూడు సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించాలనే దేశవ్యాప్త పిలుపులో భాగంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సీఐటీయూ భవన్ నుంచి హమాల్‌వాడీ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు.

వివరాలు మెయిన్‌లో..

పసుపునకు రూ.15 వేల మద్దతు ధర ప్రకటిస్తేనే

పసుపు బోర్డుకు సార్థకత

- దిగుమతులపై కేంద్రం నియంత్రణ విధించాలి
- అప్పుడే పసుపు రైతుకు సంపూర్ణ ప్రయోజనం
- పసుపు బోర్డును స్వాగతిస్తున్నాం : ఎమ్మెల్సీ కవిత
- త్రిముఖ వ్యూహంతో అలుపెరగని పోరాటం చేసినట్టు వెల్లడి
- తాము పసుపు బోర్డు డిమాండ్ చేసినప్పుడు అరవింద్ రాజకీయాల్లోనే లేరని ధ్వజం

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

పసుపు బోర్డు ఏర్పాటును స్వాగతి స్తున్నట్టు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. అయితే, క్వింటాలు పసుపునకు రూ. 15 వేల కనీస మద్ధతు ధర ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పసుపు దిగుమతులపై నియంత్రణ విధించాలని సూచించారు. ఈ రెండు చేసినప్పుడే పసుపు బోర్డుకు సార్థకత ఏర్పాడుతుందని, అప్పుడే పసుపు రైతులకు సంపూర్ణ న్యాయం లభిస్తుందని స్పష్టం చేశారు. తూతూమంత్రంగా పసుపు బోర్డును ఏర్పాటు చేయడం కాదని, అందుకు తగిన సౌకర్యాలు, పరిశోధన సామర్థ్యాన్ని కేంద్ర ప్రభుత్వం సమకూర్చాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు.

నవతెలంగాణ 2
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
సోమవారం | జనవరి 20, 2025 | www.navatelangana.com

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



నవతెలంగాణ-భీంగల్ రూరల్
మండలంలోని దేవన్‌పల్లి, కారేపల్లి, బడా భీంగల్ గ్రామాల్లో సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయా గ్రామాల నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు తెలంగాణ సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డికి, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు బాధవత్ గోపాల్ నాయక్, జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మాలవత్ రాములు నాయక్, గ్రామ అధ్యక్షులు మాలవత్ రమేష్, బీసీ సెల్ బోండ్ల గంగాధర్, వీడీసీ బొడ్డు చిన్న గంగారం, చిన్నయ్య, లింబాద్రి, వంజరి రమేష్, శంకర్, ధర్సింగ్, రమేష్ పాల్గొన్నారు.

దేవాంగ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఆర్మూర్
పట్టణంలోని పెర్కిట్ దేవాంగ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవాంగ సంఘం అధ్యక్షుడు గుండెం రమేష్, ఉపాధ్యక్షులు పుచ్చుల విజయ్, కూర్కు గంగాధర్, పస్పుల సుదర్శన్, కోషినం హన్మండ్లు, మట్ట శ్రీనివాస్, రాజలింగం, కార్యవర్గ సభ్యులు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక ట్రాక్టరుల పట్టివేత



అదుపులోకి తీసుకున్న ఇసుక ట్రాక్టర్లు

నవతెలంగాణ-పొతంగల్
మండలంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న 6 ట్రాక్టర్లను ఆదివారం పట్టుకున్నట్లు కోటగిరి ఎస్సై సందీప్ తెలిపారు. అనుమతి లేకుండా మంజీర నది నుంచి ఇసుక తరలిస్తున్న సుంకిని గ్రామానికి చెందిన 4, కొడిచెర్ల గ్రామానికి చెందిన 2 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్రికెట్‌లో నిజామాబాద్ బార్ అసోసియేషన్ జట్టు విజయం



గెలుపొందిన నిజామాబాద్ బార్ అసోసియేషన్ జట్టు

నవతెలంగాణ-కంఠేశ్వర్
నిజామాబాద్ పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో క్రికెట్ పోటీల్లో ఆదివారం బోధన్ బార్ అసోసియేషన్ క్రికెట్ జట్టుపై నిజామాబాద్ బార్ అసోసియేషన్ క్రికెట్ జట్టు విజయం సాధించింది. బోధన్ జట్టు సమ్మయ్య నాయకత్వంలో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన బోధన్ ఇరవై ఓవర్లలో మూడు వికెట్లు నష్టపోయి మొత్తం 128 పరుగులు చేసింది. ఆ తరువాత బ్యాటింగ్ చేసిన నిజామాబాద్ 11.2 ఓవర్లలోనే 129 పరుగులు చేసి విజయాన్ని మూటగట్టుకుంది. న్యాయవాది సుజీత్ 64 పరుగులు చేసి ఆల్‌రౌండర్ ప్రతిభ కనపరిచారు. నిజామాబాద్ బార్ క్రికెట్ జట్టు కెప్టెన్ జగన్మోహన్‌గౌడ్ స్ఫూర్తిదాయకమైన ఆటను ప్రదర్శించిన వారికి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా బార్ ఉపాధ్యక్షుడు పెండెం రాజు, ప్రధాన కార్యదర్శి వసంత్ రావు మాట్లాడుతూ.. నేటితో క్రికెట్ పోటీలు ముగిశాయని, క్యారమ్స్, షటిల్, చెస్, టేబుల్ టెన్నిస్ పోటీలు కొనసాగుతున్నాయని, పోటీలలోని విజేతలకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిలాకోర్టు ప్రాంగణంలో జరుగనున్న కార్యక్రమంలో జిల్లా జడ్జి సునీత కుంచాల, బార్ అధ్యక్షుడు జగన్మోహన్ గౌడ్, బార్ కౌన్సిల్ సభ్యులు రాజేందర్‌రెడ్డి అతిథులుగా పాల్గొని బహుమతులు అందజేయనున్నారని వారు తెలిపారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ క్రికెట్ జట్టు జగన్ మోహన్‌గౌడ్ కెప్టెన్‌గా వ్యవహరించిన జట్టులో యెర్రం విఘ్నేష్, డాన్పల్ సురేష్, సుజీత్, ఉదయ్ కృష్ణ, ఎ.దీపక్, ఎన్ఎస్ చౌదరి, హమీమ్, ప్రమోద్, వెంకటేశ్వర్, అయ్యుబ్, ప్రకాష్, కె.ఎస్.నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ భాషిత విద్యార్థులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్
పట్టణంలోని శ్రీ భాషిత విద్యార్థులకు శనివారం సాయంత్రం సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని పెద్దోల్ల గంగారెడ్డి (అడ్వకేట్) ఆర్గానిక్ ఫార్మింగ్ గురించి విద్యార్థులకు చెప్పారు. ఇంటి ఆవరణలో చెరుకును పండించి చెరుకు నుంచి బెల్లం తయారీ చేయు విధానాన్ని వివరించారు. ఈ చెరుకు పంట సంవత్సరానికి ఎన్నిసార్లు పండించాలి, పండిస్తే ఎంత లాభం వస్తుందనే విషయాలను చెప్పారు. అంతే కాకుండా ఎటువంటి రసాయనాలు ఉపయోగించకుండా చెరుకు పంటను పండించవచ్చునని చెప్పారు. ఈ మధ్యకాలంలో రసాయనాలు కలిగిన ఆహారం తినడం వలన చాలామంది రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. అందువల్ల మన ఇంటికి అవసరమైన బెల్లాన్ని మనమే తయారు చేసుకోవచ్చునని వివరించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. మీరు రాబోయే తరాలవారికి భావి భారత పౌరులు కాబట్టి సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ పోలపల్లి సుందర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఇది చదువులో భాగమని, అంతేకాకుండా సేంద్రియ వ్యవసాయం వలన ఎటువంటి ఉపయోగాలు ఉన్నాయో వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో క్రికెట్ టోర్నమెంట్



నవతెలంగాణ-ఆర్మూర్
పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం బాలక్ రామ్, క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌కు నిజామాబాద్, ఆర్మూర్, ఖానాపూర్ జిల్లాల వారు పాల్గొనగా.. నిజామాబాద్ టీం విన్నర్‌గా గెలిచారు. అభినాయి శర్మ, ఆర్మూర్ టీం దీపక్ శర్మకు మెమెంటోస్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్స్ సుధీర్ శర్మ, మణిదీప్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

రైతుల పోరాట ఫలితమే పసుపు బోర్డు

- **తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకేట అన్వేష్ రెడ్డి**



మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకేట అన్వేష్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్
రెండు దశాబ్దాల రైతన్నల పోరాట ఫలితమే నేడు జిల్లా కేంద్రానికి పసుపు బోర్డు రావడం అని తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకేట అన్వేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని విత్తనాభివృద్ధి సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పసుపు బోర్డు కోసం 2015లో పోరాటం ప్రారంభించి, 2018 సంవత్సరం ఎర్రజొన్న, పసుపు బోర్డు కోసం ఉద్యమాలు చేసినట్టు, 2019 మోర్తాడ్ బద్దం వాడలో ఫిబ్రవరి 4న రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రభుత్వాల మీద ఒత్తిడి తీసుకొచ్చి, అదే నెల 7వ తేదీన పట్టణంలో ధర్నా నిర్వహించినట్టు తెలిపారు. పసుపు బోర్డు లక్ష్యంగా ప్రభుత్వాలు ఎన్ని ఇబ్బందులు పెట్టిన పోలీసులు నిర్బంధించిన, మాపై కేసులు పెట్టిన వీటన్నిటిని ఎదుర్కొని జైలుకు సైతం వెళ్లినట్టు తెలిపారు. పసుపు బోర్డు ఏర్పాటు కోసం పది పదిహేను సంవత్సరాలుగా చెప్పుల్లేకుండా పోరాటం చేసిన ముత్యాల మనోహర్‌రెడ్డి మన మధ్య లేకపోవడం బాధాకరమని అన్నారు. పార్టీలకు అతీతంగా స్పైసిస్ బోర్డుతో ఎలాంటి లాభం లేదని, పసుపు బోర్డు కోసం పోరాటం చేసినట్టు వివరించారు. 2019 పార్లమెంట్ ఎన్నికలలో 176 మంది రైతన్నలతో నామినేషన్ వేసిన ప్రధాని మోడీ దృష్టికి వెళ్లినట్టు తెలిపారు. బాల్కొండ నియోజకవర్గంలోని ఎల్కటూర్ గ్రామంలోనూ పసుపు బోర్డు కోసం పాదయాత్ర సైతం చేసినట్టు, ఎంపీగా అరవింద్ బాండ్ పేపర్ రాసి గెలువగా, రైతు ఐక్య కార్యాచరణ కమిటీ వెన్నంటే ఉండి పసుపు బోర్డు జిల్లాకు తీసుకురావడం కీలకపాత్ర నిర్వహించడం జరిగిందని అన్నారు. చైర్మన్‌గా ఈ ప్రాంత వాసిని నియమించటం ఎంతో అభినందనీయమని తెలిపారు. పూర్తిస్థాయిలో నిర్మాణం సిబ్బంది ఏర్పాటు చేయాలని, రైతు ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులపై పెట్టిన కేసులను విత్ డ్రా చేయాలని కోరారు. రైతు ఐక్య కార్యాచరణ నాయకులు వి.ప్రభాకర్, దేగాం యాదగౌడ్ మాట్లాడుతూ.. పసుపు బోర్డు సాధనను వ్యతిరేకించిన వారు తమ వల్లే వచ్చిందని చెప్పుకోవడం సరైనది కాదని, కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ రంగానికి మొగ్గు చూపుతూ, నూతన వ్యవసాయం నుంచి రైతు కూలీగా మారే పరిస్థితులున్నాయని అన్నారు. 15 వేల మద్దతు ధర ప్రకటించి, ఆహార పంటగా పరిగణించాలని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా పసుపు బోర్డు వచ్చినట్టు వివరించారు. అధ్యక్షుని నియామకం జరిగినా.. కాలయాపన చేయకుండా పసుపు నాణ్యత, పూర్తి సదుపాయాలు కల్పించాలని, దళారి వ్యవస్థ ఉండకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు ఐక్య కార్యాచరణ ప్రతినిధులు దేవారం, కోలా వెంకటేష్, లింగారెడ్డి, ముత్తెన్న, గడ్డం మహేందర్‌రెడ్డి, మచ్చర్ల రాజన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచవ్యాప్తంగా యోగాకు ప్రాముఖ్యత

- **మనదేశంలో నేర్చుకుని వారి దేశాల్లో శిక్షణనిస్తున్న విదేశీయులు**
- **మంచి ఆరోగ్యం కోసం రోజూ యోగా సాధన చేయాలి**
- **వివేకానంద యోగా కేంద్రం రజతోత్సవంలో మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్**



మాట్లాడుతున్న మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్

నవతెలంగాణ-కంఠేశ్వర్
ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలలో యోగా కేంద్రాలు ఏర్పాటు అయ్యాయని భారతదేశానికి వచ్చి యోగా నేర్చుకొని అక్కడ యోగాసనాలు నేర్పుతున్నారని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ పేర్కొన్నారు. ఎక్కొండ ప్రభాకర్ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా అర్సపల్లిలో నిర్వహిస్తున్న వివేకానంద యోగా కేంద్రం రజతోత్సవ వేడుకలకు మధుయాష్కీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా యోగాకు ప్రాముఖ్యత ఏర్పడుతుందన్నారు. మనదేశంలో నేర్చుకుని వెళ్ళిన విదేశీయులు అక్కడి ప్రజలకు యోగ శిక్షణ ఇస్తున్నారన్నారు. మంచి ఆరోగ్యానికి ప్రతి ఒక్కరూ ప్రతిరోజు యోగా చేయాలని సూచించారు. రాష్ట్రంలోని తమ ప్రభుత్వం ద్వారా కూడా యోగా కేంద్రాల విస్తరణకు కృషి చేస్తానని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లాలోని అవసరమైన చోట యోగా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో మాట్లాడుతానని పేర్కొన్నారు. యోగా కేంద్రాల అభివృద్ధికి స్థానిక ఎంపీ అరవింద్ ద్వారా కేంద్ర ప్రభుత్వ సహకారం తీసుకోవాలని సూచించారు. తనకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందంటే అది నిజామాబాద్ ప్రజల వల్లేనని పేర్కొన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు ఇలాంటి యోగా కేంద్రాల నిర్మాణాలు, ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులే చేశానని పేర్కొన్నారు. పదవిలో ఉన్నా లేకున్నా ప్రజల ఆదరాభిమానాలు ఉన్నాయంటే.. తన వ్యక్తిత్వం, నీతి నిజాయితీతో పని చేస్తూ ప్రజలతో తనకున్న అనుబంధమేనని పేర్కొన్నారు. యోగా గురువు ప్రభాకర్ జిల్లా వ్యాప్తంగా ఎన్నో యోగా కేంద్రాలను ఏర్పాటు చేయడం.. యోగా సాధన ద్వారా జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డులు పొందడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యోగా గురువులతోపాటు యోగా సాధనలో జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు పొందిన పలువురిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, జిల్లా యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బాల శేఖర్, 15వ డివిజన్ కార్పొరేటర్ మొచ్యూర్ లావణ్య, వివేకానంద యోగా కేంద్రం అధ్యక్షులు ఎల్.ఇంద్రకరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన, విహారయాత్రతో మానసిక, విజ్ఞాన వికాసం

- **మిసిమి ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ బాలే రవీందర్**



విజ్ఞాన, విహారయాత్రలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
విజ్ఞాన విహారయాత్రతో విద్యార్థులకు మానసిక వికాసం, విజ్ఞానంతో పాటు వినోదం లభిస్తుందని మిసిమి ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ బాలే రవీందర్ అన్నారు. మండల కేంద్రంలోని మిసిమి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఐదు రోజులపాటు విజ్ఞాన, విహారయాత్రకు వెళ్లి వచ్చారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రవీందర్ మాట్లాడుతూ.. ఐదు రోజుల విజ్ఞాన విహారయాత్రలో భాగంగా రామప్ప, లక్నవరం, వేయి స్తంభాల గుడి, వైజాగ్, అరకు, బొర్రగుహలు, సింహాద్రి అప్పన్న, రామకృష్ణ బీచ్, ద్వారక తిరుమల, భద్రాచలం, పాపికొండలు తదితర ప్రాంతాలను విద్యార్థులు సందర్శించినట్లు తెలిపారు. ఆయా ప్రదేశాలను సందర్శించిన సమయంలో ఆ ప్రాంత ప్రాముఖ్యతను, విశేషాలను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించినట్టు తెలిపారు. విజ్ఞాన, విహారయాత్రలో పలు ప్రదేశాలను సందర్శించడం పట్ల విద్యార్థులు ఆనందంగా ఉన్నట్లు తెలిపారు. విజ్ఞాన, విహారయాత్ర ద్వారా పిల్లల మానసిక వికాసానికి, వారి విజ్ఞాన వినోదానికి సహకరించిన తల్లిదండ్రులకు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఐదు రోజుల విజ్ఞాన, విహార యాత్ర విజయవంతంగా ముగియడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సంజీవ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించకుంటే ఆందోళన

నవతెలంగాణ-పొతంగల్
మండల కేంద్రంలోని కెనాల్ బౌండ్రి, ప్రభుత్వ స్థలాలకు రక్షణ కల్పించపోతే ఆందోళన చేస్తామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఓమయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని సీపీఐ మండల కార్యదర్శి విఠల్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఆ సందర్భంగా ఓమయ్య మాట్లాడుతూ.... కెనల్ బౌండ్రీలను ఆక్రమించడంతో రైతాంగానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు ఆనంద్, బీఆర్ఎస్ ఉమ్మడి మండలాధ్యక్షుడు నవీన్, బీజేపీ నాయకులు రాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు పోచీరాం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పలువురు

నిజామాబాద్ వినియోగదారుల డివిజన్ కమిటీల ఏర్పాటు



నవతెలంగాణ-కంఠేశ్వర్
ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇందూర్ వినియోగదారుల సంక్షేమ సమితి జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నగరంలోని జిల్లా కార్యాలయం వినాయక్‌నగర్‌లో నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా సీసీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి హాజరై నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల డివిజన్ కార్యవర్గ సభ్యులను ప్రకటించారు. ఉమ్మడి జిల్లా కార్యవర్గాన్ని విస్తృత పరిచే భాగంలో నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షులుగా రాజుల రామనాథం, ఆర్మూర్ డివిజన్ అధ్యక్షులుగా పొడపల్లి అనిల్, బోధన్ డివిజన్ అధ్యక్షులుగా మారోజు సుధాకర్ చారిని నియమించారు. సాంబరాజు చక్రపాణి మాట్లాడుతూ.. జిల్లాలోని గ్రామీణ స్థాయిలో ఆహార కల్తీపై చైతన్య సదస్సులను ముమ్మరం చేయనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో ఆహార పదార్థాలను కొనవద్దని, తినవద్దని తెలిపారు. జిల్లాలోని అంగన్వాడీ సెంటర్లు ఆహార కల్తీ జరగకుండా జాగ్రత్త వహిస్తూ, ప్రజలకు సహకరించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు పెందోట అనిల్, ఉపాధ్యక్షులు వివిఎస్ వర్మ, ఉపాధ్యక్షుడు రాజుల రామనాథం, ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్, ఆర్గనైజర్ సెక్రెటరీ మహాదేవుని శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి గైని రత్నాకర్, ఆర్మూర్ డివిజన్ అధ్యక్షులు పొడపల్లి అనిల్, బోధన్ డివిజన్ అధ్యక్షులు సుధాకరచారి, రూరల్ ఇంచార్జి యాటకర్ల దేవేష్, గడప రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీలకు సపరేట్ బడ్జెట్ ఇవ్వాలి

- **కనీసం గౌరవ వేతనం రూ.26వేలు ఇవ్వాలి**
- **నిజామాబాద్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లికి వినతి**



మంత్రికి వినతిపత్రాన్ని అందజేస్తున్న ఆర్పీలు

నవతెలంగాణ-కంఠేశ్వర్
రిసోర్స్ పర్సన్స్ (ఆర్పి)లకు సపరేట్ బడ్జెట్ ఇవ్వాలని, కనీస గౌరవ వేతనం రూ.26,000 ఇవ్వాలని నిజామాబాద్ ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు నిజామాబాద్ ఆర్పీలు తమ డిమాండ్లను సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాన్ని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్పీల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, నిజామాబాద్ జిల్లా అధ్యక్షురాలు దొండి స్వర్ణలత మాట్లాడుతూ.. డ్రెస్ కోడ్ ఇన్సూరెన్స్ ఇప్పించాలని కోరారు. అలాగే పిఆర్‌సి రావడం లేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా.. మెప్మా అర్పిలను గ్రామాల్లో పనిచేసే వివోఏకు కలపడానికి ప్రభుత్వం అతి త్వరలో నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ఆర్పీల సమస్యలను కచ్చితంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీనిచ్చారని వివరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గాజుల మంజుల, జిల్లా కోశాధికారి దాసరి స్వప్న, జిల్లా ఉపాధ్యక్షురాలు సుదం రాజమణి తదితరులు పాల్గొన్నారు.

భక్తుల సామూహిక పారాయణం



పారాయణంలో పాల్గొన్న మహిళలు

నవతెలంగాణ-బోధన్
బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్‌లో గల రామాలయంలో ఆదివారం భక్తులు సామూహిక పారాయణం నిర్వహించారు. సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధన ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రదీప్ గుప్తా, ఎంఈవో నాగయ్య, పట్టణ కార్యదర్శి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవకుడిని సన్మానించిన చిన్ననాటి మిత్రులు



సన్మానించిన మిత్రులు

నవతెలంగాణ-ఆర్మూర్
జాతీయ స్థాయిలో భారత సేవ రత్న పురస్కారం అందుకున్న సందర్భంగా బాలుర ఉన్నత పాఠశాలలో చదువుకున్న చిన్ననాటి స్నేహితులు పట్వారీ తులసి కుమార్‌ను పూలమాల శాలువాతో ఆదివారం సన్మానించారు. స్థానిక బాలుర పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వీరి సేవలు మాలాంటి స్నేహితులకు, నేటితర యువతరానికి విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని వారికి తాము ఎల్లప్పుడూ సహకారంగా ఉంటామని తెలిపారు.

6 గ్యారంటీల అమలులో విఫలం



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-లింగంపేట్

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చినటువంటి ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ మర్రి రామ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసినటువంటి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఆరు గ్యారటీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. రైతులకు రుణమాఫీ అందించిన దాఖలాలు లేవని, రైతు భరోసా పేరిట కాలయాపన చేస్తుందని, ఎన్నికల్లో ఇచ్చినటువంటి వాగ్దానంలో పూర్తిగా ఏ ఒక్కటి అమలు కాలేదు అన్నారు.

షాట్ బౌండ్రీ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు ఉత్సవాలు


గెలుపొందిన జట్టు

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో మూడు రోజులపాటు షాట్ బౌండ్రీ క్రికెట్ టోర్నమెంట్ ప్రతి ఒక్కరిని ఆకర్షింప చేశాయి. మూడు రోజులు జరిగిన ఈ టోర్నమెంట్‌లో ప్రథమస్థానంలో నవదుర్గ గణేష్ మండలి జట్టు, ద్వితియస్థానంలో వెంకటేశ్వర గణేష్ మండలి జట్టు నిలిచాయి. గెలుపొందిన జట్లకు గ్రామ పెద్దలు, పార్టీల నాయకులు పాల్గొని బహుమతులను అందజేశారు. ముగింపు కార్యక్రమంలో డాక్టర్ బండి వార్ విజయ్, చౌలవార్ హనుమాన్లు, స్వామి, రమేష్, కృష్ణ, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

నెలరోజులుగా మార్కెట్‌లోనే
సోయా కొనుగోలుకు రైతుల ఎదురుచూపులు

- ఆందోళనలు చేపట్టినా పట్టని పాలకులు

నవతెలంగాణ-మద్నూర్

సోయా పంట కొనుగోలుకు రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఈ నెల 7వ తేదీతో కొనుగోలు కేంద్రాన్ని మూసివేయడంతో.. మార్కెట్‌కు తీసుకొచ్చిన రైతులు పంట కొనుగోలు చేస్తారని ఎదురుచూపులు చూస్తున్నారు. పలుమార్లు ఆందోళన చేపట్టినా పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మద్నూర్ మండలం వ్యాప్తంగా సుమారు 21 వేల ఎకరాల్లో సోయా పంట సాగైంది. అయితే ప్రతేడాదితో పోలిస్తే ఈసారి దిగుబడి సగానికి పడిపోయింది. గతేడాది ఎకరానికి 9 నుంచి పది క్వింటాళ్ల దిగుబడి వస్తే ఈసారి 5 నుంచి 6 క్వింటాళ్లకే పరిమితమైంది. అయితే మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మద్నూర్ సింగిల్ విండో ద్వారా మార్కెట్ యార్డులో సోయా కొనుగోలు చేపట్టారు. సుమారు 46 వేల క్వింటాళ్ల వరకు కొనుగోలు పూర్తి చేశారు. అయితే కొనుగోలు లిమిట్ దాటిపోయిందని ఈ నెల 7వ తేదీ నుంచి కొనుగోలు కేంద్రాన్ని మూసివేశారు. అయితే ప్రస్తుతం సుమారు 50 మంది రైతులకు సంబంధించి 8000 క్వింటాళ్ల ధాన్యం మార్కెట్ యార్డులోనే ఉండిపోయింది. కొనుగోలు తిరిగి ప్రారంభిస్తే విక్రయించుకునేందుకు రైతులు ఎదురుచూస్తున్నారు.

ఆందోళన.. కొనుగోలు చేస్తామని హామీ

పంట అమ్మడానికి తీసుకువచ్చిన రైతులు కొనుగోళ్లు జరగకపోవడంతో అక్కడే మకాం వేయాల్సిన పరిస్థితి నెలకొంది. పంట కొనుగోలు జరపాలని మార్కెట్ యార్డులో నిల్వలతో ఉన్న సోయా పంట రైతులు పలుమార్లు అధికారులకు వినతిపత్రం అందించడంతో పాటు రోడ్డెక్కి రాస్తారోకో ఆందోళనలు చేపట్టారు. ఇంత జరిగినా రైతుల విజ్ఞప్తికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కొనుగోళ్ల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. రైతులు అధికారులకు వినతి పత్రాలు అందించగా ఇటీవల బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి జిల్లా మార్క్‌ఫెడ్ డిఎం మద్నూర్ సందర్శించి రైతులతో చర్చలు జరిపి కొనుగోలు జరపడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు కొనుగోలు ప్రారంభించకపోవడంతో రైతులు ఎదురుచూస్తూనే ఉన్నారు.


నెల రోజుల నుంచి మార్కెట్‌లోనే ధాన్యం

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని మేంగారం గ్రామంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును బాధితునికి అందజేసినట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బుర్ర నారా గౌడ్ తెలిపారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశానుసారం బాధితుడు తంతిరి బాలయ్యకు అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు కలాల్ బాలా గౌడ్, ఉపాధ్యక్షులు అన్నం సాయిలు, ఏసిఎస్ వైస్ చైర్మన్ మకం రాములు, కంది రాజశేఖర్, రమేష్, రాములు, శ్రీను, గణేష్, బాలరాజ్, పాల్గొన్నారు.

మేరు కులస్తులకు బీసీ 'ఏ' లోకి మార్చాలి


మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్షులు

నవతెలంగాణ-పిట్లం

మేరు కులస్తులను బిసి 'డి' గ్రూప్ నుంచి బిసి 'ఏ' గ్రూపులోకి మార్చాలని మేరు సంఘం జిల్లా అధ్యక్షులు సర్ కొండ నారాయణ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆర్య సమాజ్ భవనంలో మేరు సంఘ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలలో , సంక్షేమ పథకాలలో ప్రాతినిధ్యం కల్పిస్తూ ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. మేరు సామాజిక వర్గాన్ని ఇతర సామాజిక వర్గాల వారి మాదిరిగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని మండల స్థాయి సంఘాలను బలోపేతము చేసి ఉన్నత స్థాయికి తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రుద్రంగి రమేష్ కార్యదర్శి రాచర్ల సంతోష్, మండల అధ్యక్షులు కోపూరి శివకుమార్, ప్రధాన కార్యదర్శి డి. పవన్, కోశాధికారి ఏన్నావార్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాలకు అండ

నవతెలంగాణ-భిక్కనూర్

నిరుపేద కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ తెలిపారు. భిక్కనూర్ మండలానికి చెందిన సంజయ్ కుమార్, స్వప్న ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన చెక్కును బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు భీమ్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేష్, నాయకులు లింబాద్రి, మహిపాల్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేవైసీఎస్ క్యాలెండర్ ఆవిష్కరించిన షబ్బీర్‌అలీ


క్యాలెండర్‌ను ఆవిష్కరించిన షబ్బీర్‌అలీ

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా కేంద్రంలో కురుమ యువ చైతన్య సమితి (కేవైసీఎస్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను జిల్లా అధ్యక్షులు మామిడి సంజీవ్ కురుమ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ మంత్రి, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి నియోజకవర్గ, టౌన్ యూత్ ప్రెసిడెంట్ గొడుగుల శ్రీనివాస్, కేవైసీఎస్ రాష్ట్ర నాయకులు చెలిమేటి గంగాధర్, కురుమ జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రోళ్ల స్వామికురుమ, మాచారెడ్డి మండల అధ్యక్షులు కురుమ సంతోష్, భిక్కనూర్ మండల సలహాదారులు కడబోయిన సాగర్, కురుమ దోమకొండ కార్యదర్శి ముత్తి బుచ్చిరాజ్ కురుమ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా సాగిన క్రికెట్ మ్యాచ్

- విజేతలకు ట్రోఫీ అందించిన మాజీ ఎంపీపీ ప్రతాప్ రెడ్డి

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ గత 12 రోజుల గా కొనసాగిన టోర్నమెంట్లో వివిధ మండలాల క్రికెట్ జట్లు పాల్గొనగా ఆదివారం నాడు ఫైనల్ మ్యాచ్‌లో పెద్దకొడప్ గల్ వర్సెస్ బిచ్కుంద జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన పెద్ద కొడప్ గల్ మొత్తం 12 ఓవర్లకు 107 పరుగులు చేయగా బిచ్కుంద జట్టు 60 పరుగులు మాత్రమే చేసింది. 48 పరుగుల తేడాతో పెద్దకొడప్‌గల్ జట్టుకు మాజీ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి ట్రోపి తో పాటు 25,555 నగదును బహుమతిగా అందించారు. రన్నరప్ జట్టుకు రూ.12,222 నగదు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకుల మాట్లాడుతూ మాజీ ఎంపిపి ప్రతాప్ రెడ్డి సహకారంతో ఈ క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహించామని ఇలాంటి సహకారం అందిస్తే మరెన్నో క్రీడా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. మాజీ ఎంపీపీ మాట్లాడుతూ మండల కేంద్రంలో గత 12 రోజుల నుండి సాగిన క్రికెట్ టోర్నమెంట్ ఎన్నో జట్లు పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం మాజీ ఎంపీపీ, సొసైటీ చైర్మన్ హన్మంత్‌రెడ్డిని శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీలర్ శ్రీనివాష్ రెడ్డి, హన్మంత్ రెడ్డి, కామెంటర్ బాలాజీ పాటిల్, సౌరబ్ ప్రతాప్ సింగ్, పండరీ, నవీన్, క్రాంతి కిరణ్, నిర్వాహకులు ప్రేమ సింగ్, రాందాస్, రవీందర్, బలరాం ,బాల్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.


ట్రోఫీ అందిస్తున్న మాజీ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి

కళ్యాణ మండపానికి మాజీ సర్పంచ్ విరాళం


విరాళం అందజేస్తున్న మాజీ సర్పంచ్

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు పట్టణ కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న నూతన కళ్యాణ మండపానికి మాజీ సర్పంచ్ వేణు 5 లక్షల రూపాయల విరాళాన్ని ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రాములకు అందజేశారు. సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని అధ్యక్షులు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రమేష్, బిక్షపతి, సొసైటీ చైర్మన్ భూమయ్య, సంఘం సభ్యులు రామచంద్రం, నర్సింలు, ఆంజనేయులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రైతు భరోసా సర్వే


సర్వే నిర్వహిస్తున్న అధికారులు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలో ఆయా గ్రామాలలో ఆదివారం రైతు భరోసా సర్వే నిర్వహించారు. మండలంలోని మోతే, మెంగారం మంబోజి పేట్, లింగంపల్లి గ్రామాలలో వ్యవసాయ శాఖ అధికారులు రెవెన్యూ అధికారులు సంయుక్తంగా చేపట్టారు. సాగుకు యోగ్యం కానీ భూములను కోళ్ల ఫారాలు భవన నిర్మాణాలు రియల్ ఎస్టేట్ ప్లాట్లు తదితర భూములను గుర్తించడం జరిగిందన్నారు. రైతు భరోసా ఆధారంగా ప్రభుత్వ ఆదేశానుసారం గ్రామాల్లో గూగుల్ మ్యాప్ ఆధారంగా సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించి వాటి వివరాలను సర్వే నంబర్లను నమోదు చేసుకుంటున్నట్టు తెలిపారు. నివేదికను రెవెన్యూ అధికారులకు అందజేయనున్నట్టు తెలిపారు. ఈనెల 16 నుండి 26వ తేదీ వరకు గ్రామాలలో రైతు భరోసా సర్వేను చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ నరేందర్, వ్యవసాయ అధికారి అనిల్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ సంగమేశ్వర్, ఆర్ఐ కిరణ్, విస్తీర్ణ అధికారులు మధుసూదన్ రాకేష్ నవ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీల అమలుకు పోరాటం చేస్తాం

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గంప శశాంక్

నవతెలంగాణ-కామారెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలో ఇచ్చిన 6 గ్యారెంటీల హామీల అమలుకై బిఆర్ఎస్ పార్టీ కెసిఆర్, గంప గోవర్ధన్ నాయకత్వంలో పోరాటం చేస్తామనిబిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గంప శశాంక్ అన్నారు. కామారెడ్డి జిల్లా క్యాసంపల్లి గ్రామంలో కామారెడ్డి మండల బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించి పరిష్కారం కోసం బిఆర్ఎస్ యువజన విభాగం అధికారులతో మాట్లాడి ఆ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని పిలుపు ఇచ్చారు. కామారెడ్డి నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగాన్ని మరింత బలోపేతం చేసేందుకు పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో బి ఆర్ ఎస్ యువజన విభాగం కామారెడ్డి పట్టణ అధ్యక్షుడు చెలిమెల భాను ప్రసాద్ నేత, బి ఆర్ ఎస్ యువజన విభాగం కామారెడ్డి, మాచారెడ్డి మండల అధ్యక్షులు అనిల్ రెడ్డి, లష్కర్ నాయక్ బి ఆర్ ఎస్ యువజన విభాగం మండల నాయకులు ప్రభాకర్ రెడ్డి,పరశురామ్ గౌడ్,ప్రభాకర్ గౌడ్, సమీర్, 100 మంది యువజన విభాగం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గంప శశాంక్

నిరుపేద కుటుంబాలకు యూత్ ఫర్ యూనిటీ చేయూత

నవతెలంగాణ-భిక్కనూర్

నిరుపేద కుటుంబాలకు యూత్ ఫర్ యూనిటీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సభ్యులు తెలిపారు. మండలంలోని బస్వాపూర్ గ్రామంలో ఇటీవల కాలంలో మరణించిన గ్రామానికి చెందిన యశ్వంత్ కుటుంబ సభ్యులను యూత్ ఫర్ యూనిటీ ఆధ్వర్యంలో ఆదివారం పరామర్శించి గ్రామస్తుల తరపున 31 వేల 200 రూపాయలు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ యూనిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని అంజనీ గేటు వద్ద ఆదివారం ఏఎస్ఐ రాములు, నేషనల్ హైవే అధికారుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత మనందరి బాధ్యతని, రోడ్డు నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని అన్నారు. ప్రతి ఏడాది రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా పోలీసు, సయుక్తంగా నిర్వహిస్తున్నామని హెల్మెట్ ధరించక పోవడం, అతివేగం, నిర్లక్ష్యం, మద్యం సేవించి, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఒక సెల్ ఫోన్ కొంటేనే దానికి సురక్షితంగా కవర్ వేస్తున్నాము కానీ మనిషికి విలువయ్యే తలకు మాత్రం హెల్మెట్ ధరించడం లేదని, ఒక చిన్న సెల్ ఫోన్‌కు ఇస్తున్న ప్రాధాన్యత మనిషి ప్రాణానికి ఇవ్వట్లేదని అన్నారు. ప్రతి ఒక్కరూ భద్రతా ప్రమాణాలు పాటించి క్షేమంగా ఇంటికి చేరుకోవాలని వాహనదారులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో హైవే ఆక్సిడెంట్ మేనేజర్ సౌర ప్రతాప్ సింగ్, పోలీస్ సిబ్బంది వెంకట్, అంజి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు దారేది..?

- స్కూల్‌కు వెళ్లే దారి పట్టాభూమి

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ పాఠశాలలో జిల్లాలోని నలుమూలల నుండి విద్యార్థినిలు విద్యా బోధన చేస్తున్నారు. కానీ పాఠశాలలోనికి వెళ్లాలంటే దారి లేకుండా పోయింది. పాఠశాల ఎదురుగా అన్ని పట్టా భూములే కావడం గమనార్హం. ఇటీవల పాఠశాల ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాల్లో తమ పట్టా భూములు ఉన్నాయని వాటిలో తాము ఇండ్ల నిర్మాణం చేపడతామని పలువురు గ్రామస్తులు సిద్ధమవుతున్నారు. వందలాదిమంది విద్యార్థుల కోసం పట్టాదారుల నుండి కొనుగోలు చేసి ఎదురుగా ప్రత్యేక స్థలం కేటాయించి దారి చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ సమస్య గత 15 సంవత్సరాల నుండి పరిష్కారం కావడం లేదని స్థానిక ఎమ్మెల్యే , జిల్లాస్థాయి అధికారులు స్పందించి పాఠశాలకు దారి చూపాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు కోరుతున్నారు.



40 ఏండ్లుగా ఆలయంలో సేవ..
ప్రభుత్వం ఆదుకోవాలి

- సలాబత్‌పూర్ ఆంజనేయస్వామి ఆలయం పూజారి వేడుకోలు

నవతెలంగాణ-మద్నూర్



ప్రభుత్వమే నన్ను ఆదుకోవాలని శరత్ జోషి మహారాజ్ నవతెలంగాణ ముందు తన ఆవేదన వ్యక్తపరిచారు. మండలంలోని సలాబత్పూర్ ఆంజనేయ స్వామి దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆలయంలో పూజారిగా 40 సంవత్సరాలు విధులు నిర్వహించారు. 1983లో పూజారిగా ఎంపికైయ్యారు. 2019 అక్టోబర్లో పదవి విరమణ పొందారు. పదవి విరమణ సమయంలో గ్రాడ్యుటి రెండు లక్షల రూపాయలు ప్రభుత్వం అందించింది. ప్రస్తుతం ఈ మహారాజ్ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని, తనకు ఇల్లు లేదని, పెన్షన్ రాదని, నా కుటుంబ పాలన ఆచారగోచారంగా ఉందని తెలిపారు. చివరిగా పెన్షన్ లేకుండా పదవి విరమణ పొందడం వయస్సు మీరుతున్న సమయంలో కుటుంబ పోషణ భారంగా మారిందని తనకు ప్రభుత్వం ఆదుకోవాలంటూ విన్నవించుకుంటున్నారు. తనకు ఒక ఇంటి స్థలం, ఇల్లు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. తనలాంటి వారికి ప్రభుత్వం ఆదుకోవాలని ఏదో ఒక రకంగా సహాయమందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కిరాణా వర్తక సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-రాజంపేట్ (భిక్కనూర్)

రాజంపేట్ మండలంలో కిరాణా వర్తక సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులుగా చంద్రమౌళి గుప్తా, ఉపాధ్యక్షులు రాజు, కార్యదర్శి శ్రీనివాస్ గుప్తా, కోశాధికారి వెంకట రాజేశ్వర్ గుప్తా, కార్యవర్గ సభ్యులు, ప్రవీణ్, పద్మారావు, అనిల్, శ్రీనివాస్, నర్సింలు, రాజు, నర్సింలు, ఇతర సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అనంతరం అధ్యక్షులు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిరాణా వర్తక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-తాడ్వాయి

తహసిల్ కార్యాలయంలో నేడు జరిగే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ రహీముద్దీన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పదిన్నర గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు జరిగే ఈ కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు హాజరవుతారని ఏమైనా సమస్యలు ఉంటే మండల ప్రజలు ఫిర్యాదులు చేసుకోవచ్చని సూచించారు.

త్రిలింగ రామేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని తాండూర్ గ్రామ శివారులో మంజీరా నది తీరంలో గల త్రి లింగ రామేశ్వర ఆలయాన్ని మెదక్ జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ జితేంద్ర కుటుంబ సమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టత గురించి ఆలయ ధర్మకర్త దత్తును అడిగి తెలుసుకున్నారు. వారి వెంట సంజీవులు, మోహన్‌రావు, న్యాయవాది రవి, మధు, గాజుల గోపాల్ తదితరులు ఉన్నారు.

ఎస్‌జిటియు డైరీ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఆర్మూర్

కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ప్రొద్దుటూరి వినయ్‌రెడ్డి చేతుల మీదుగా ఎస్‌జిటియు డైరీని పట్టణంలోని పివిఆర్ భవన్ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీటీయూ జిల్లా అధ్యక్షులు వెంకటరమణ, మండల ఎస్‌జిటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రవీణ్, బంటు ఆనంద్, రాష్ట్ర కార్యదర్శి సోమయ్యగారి నరేష్, ప్రవీణ్ గౌడ్, వేల్పూర్ మండల అధ్యక్షులు శ్యాంసుందర్, మోర్తాడ్ మండల అధ్యక్షులు మధుసూదన్, మెండోరా మండల అధ్యక్షులు మోహన్, జిల్లా మండలాల వివిధ బాధ్యులు పాల్గొన్నారు.

పద్మశాలీలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

పద్మశాలీలు రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలని నూతనంగా ఎన్నికైన బిజెపి పార్టీ మండలాధ్యక్షుడు కన్నేపల్లి ప్రసాద్ తెలిపారు. ఆదివారం జక్రాన్‌పల్లి మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బ్రాహ్మణపల్లి గ్రామంలో నూతనంగా ఎన్నికైన బిజెపి మండల అధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్‌ను ఘనంగా సన్మానించి స్వీట్లు పంపిణీ చేశారు. పద్మశాలీలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి మండలాధ్యక్షులు శ్రీపతి శేఖర్, పంచాక్షరి రాజేందర్, శ్రీకాంత్ స్వామి, రాజేశ్వర్, కపిల్, శ్రీనివాస్, రణధీర్, పద్మశాలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.



సన్మానించిన పలువురు

ఒప్పందాల సాగు.. ఎర్రజొన్న పంట

- అగ్రిమెంట్లు ఉన్నా ప్రతీసారి నష్టాలపాలే
- మరో 25 రోజుల్లో కోతలు ప్రారంభమయ్యే అవకాశం
- ఈసారైనా మద్దతు ధర దక్కేనా..?

నవతెలంగాణ-ఆర్మూర్

ఎర్ర జొన్న రైతన్నకు ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది సైతం సిండికేట్ గాళ్లు దెబ్బకొడతారా? లేదా మద్దతు ధర దక్కుతుందా? అనే ఆందోళన రైతుల్లో సర్వత్రా వ్యక్తమవుతోంది. ప్రస్తుతం పంట చేతికి వచ్చి మరో 25 రోజుల్లో పంట కోతలు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో ధర దక్కుతుందా లేదా అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పశువులకు దాణాగా ఎగుమతి..

డివిజన్‌లో పండించే ఎర్రజొన్నలకు నార్త్ ఇండియాలో మంచి డిమాండ్ ఉంటుంది. రాజస్థాన్, హర్యానా, పంజాబ్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంది. అక్కడ పశువులకు దానాగా వాడుతారు.



బైబ్యాక్ ఒప్పందం ఉన్నా ధర తగ్గింపు..

బై బ్యాక్ ఒప్పందంలో ఒక ధర ఇస్తామని చెప్పి, ధర లేదని సాకుతో క్వింటాలుకు వెయ్యి రూపాయల వరకు గత సంవత్సరం ధర తగ్గించారు. దీంతో రైతులు నష్టపోవాల్సి వస్తుంది. 2022 సంవత్సరం 60 వేల ఎకరాల్లో పంట సాగు కాగా, గత సంవత్సరం 40,000 ఎకరాల్లో పంటను వేశారు. ఈసారి కూడా 40 నుంచి 50 వేల మధ్యన ఎకరాలలో పంటను వేశారు. సాగుకు ఎకరానికి 25 వేల వరకు ఖర్చు కాగా, 15 నుంచి 18 క్వింటాళ్ల వరకు ఎకరానికి దిగుబడి వస్తుంది. కొన్నిసార్లు అకాల వర్షాలతో సాగు తగ్గిన పంటపై జాగ్రత్తలు తీసుకోవడంతో ఆశించిన దిగుబడి వస్తది. కూలీల రేట్లు, డీజిల్ ధరలు పెరగడంతో సాగు భారం రెట్టింపు అవుతుంది. కాగా వ్యాపారులు మాత్రం బైబ్యాక్ ఒప్పందం పాటించడం లేదు. దీంతో రైతులు నిలువునా మునుగుతున్నారు. మార్కెట్లో వ్యాపారుల సిండికేట్‌పై చర్యలు తీసుకోవాలని రైతులు ప్రతిసారి డిమాండ్ చేస్తున్నా ఆచరణలో అమలు కావడం లేదు.

దళారులే బాగుపడుతున్నారు



ప్రభుత్వం వ్యాపారుల మాయాజాలంపై చర్యలు తీసుకోవాలి. సీజన్ అంతా ఒకే ధరను ప్రభుత్వం నిర్ణయించాలి. ముందుగా ఒక ధర, పంట చేతికొచ్చి చివరి సమయంలో మరో ధర ఉండడంతో తీవ్రంగా నష్టపోతున్నారు.

- పల్లపు వెంకటేష్, సీపీఐ(ఎం) నాయకులు

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



జిల్లా కేంద్రానికి పసుపు బోర్డు రావడం హర్షనీయం. ఎర్రజొన్న పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. వ్యాపారులు సిండికేట్‌గా మారి పంట ధరను తగ్గించే ప్రమాదం ఉంది. మరో కొద్ది రోజులలో పంట కోతలు ప్రారంభిస్తాం.

- చిట్యాల శ్రీధర్, రైతు, మామిడిపల్లి.

డివిజన్లో 45 ఏండ్ల నుంచి..

జిల్లాలోని ఆర్మూర్ డివిజన్‌తో పాటు బాల్కొండ నియోజకవర్గంలోని కమ్మర్‌పల్లి, వేల్పూర్, మోర్తాడ్, భీంగల్, మెండోరా, ముప్కాల్, నందిపేట్, ఆలూర్ మండలాల్లో ఎర్రజొన్న పంట పండించడంలో రైతులు ముందంజలో ఉన్నారు. డివిజన్లో ఎర్రజొన్నల సాగును రైతులు గత 45 సంవత్సరాల నుండి చేస్తున్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో పశువుల దానాకు వినియోగించే ఈ ఎర్రజొన్నను ప్రతి సంవత్సరం యాసంగిలో 40,000పైన ఎకరాలలో వేస్తున్నారు. ముందస్తుగానే వ్యాపారులతో ఒప్పందాలు చేసుకొని ఈ పంటను గత కొన్ని సంవత్సరాల నుంచి సాగు చేస్తున్నారు. అన్ని పంటల కంటే భిన్నంగా పెట్టుబడి తక్కువగా ఉండి డబ్బులు ఎక్కువగా వచ్చే ఈ పంట సాగుపట్ల ఎక్కువమంది రైతులు ముగ్గు చూపుతున్నారు. విత్తనం వేసినప్పటి నుంచి పంట చేతికి వచ్చేవరకు పని తక్కువగా ఉండడం, పెట్టుబడి కూడా ఇతర పంటల కంటే తక్కువ మొత్తంలో ఉండడంతో ఎక్కువమంది రైతులు ఈ సాగు చేస్తున్నారు. ఈ పంటకు కూలీల అవసరం తక్కువగా ఉండడం, నీటి వసతి ఎక్కువగా లేకున్నా, పంట పండే అవకాశం ఉండడంతో బోర్ల కింద ఎక్కువ మొత్తంలో సాగు చేస్తున్నారు. పంట కూడా 100 రోజుల వరకు చేతికి రావడం, అక్టోబర్ చివరి నెల నుంచి నవంబర్ నెలలో పంట వేస్తే ఫిబ్రవరిలో కోతకు వస్తుండటంతో రైతులు ఈ పంట వేస్తున్నారు. ఈ పంట తర్వాత ఇతర చిన్న రకాల పంటలు కూడా వేసుకునే అవకాశం ఉండడం వల్ల ఎక్కువమంది రైతులు సాగు చేస్తున్నారు.

2008లో ఉద్యమ బాట..

2008 సంవత్సరం గిట్టుబాటు ధర కోసం ఎర్రజొన్న రైతులు చేపట్టిన ఉద్యమం పట్టణంలో తీవ్ర సంచలనం రేపింది. నిజామాబాద్ గ్రామీణ బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాలకు చెందిన దాదాపు 25వేల మంది రైతుల నుండి విత్తనాలు కొనుగోలు చేసిన వ్యాపారి మధ్యలో చేతులెత్తేయడంతో ఉద్యమ బాట పట్టారు. ఈ నేపథ్యంలో రైతులు పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించి వ్యాపారుల ఇళ్లపై దాడులకు పాల్పడ్డారు. అడ్డువచ్చిన పోలీసులపై తిరగబడ్డారు. ఈ సందర్భంగా పోలీసులు కాల్పులు జరపగా కొంతమంది రైతులకు తూటాలు తగిలి గాయపడగా ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అప్పటి ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ దృష్టికి తీసుకెళ్లి రైతులకు రావలసిన 9.80 కోట్ల బకాయిలను 2014 ఆగస్టు 11న విడుదల చేయించారు. దీంతో మూడు నియోజకవర్గాలకు చెందిన దాదాపు 25 వేల రైతులకు ప్రయోజనం కలిగింది.

ప్రభుత్వ స్పందన కరువు..

వ్యాపారులు ప్రతి సంవత్సరం వారి స్వలాభాల కోసం ధరలను తగ్గించేందుకు ఎత్తులకు పైఎత్తులు వేయడం సర్వసాధారణమైంది. ఒప్పందం ప్రకారంగా డబ్బులు చెల్లించని వ్యాపారులపై చర్యలు కరువయ్యాయి. సంబంధిత శాఖ అధికారులు కేవలం సలహాలు, సూచనలు ఇచ్చేందుకే వ్యాపారస్తులతో రైతులతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్టు పలువురు రైతులు అంటున్నారు. నాలుగు దశాబ్దాలకుపైగా విత్తన వ్యాపారులదే పైచేయిగా అవుతుండగా, రైతులు ఆర్థికంగా నష్టపోతూనే ఉన్నారు. గత సంవత్సరం అక్టోబర్ నెలలో ఒక వర్గం విత్తన వ్యాపారులు జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును కలిసి రైతులతో ఎర్రజొన్న బైబ్యాక్ (విత్తనం సరఫరా చేసిన వ్యాపారే పంట దిగుబడి కొనుగోలు చేయాలి) ఒప్పందం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఆలూర్ మండల కేంద్రంలోని రైతులతో సీడు వ్యాపారులు రాతపూర్వక ఒప్పంద పత్రాల్లో క్వింటాలు ఎర్రజొన్నకు మూడువేల ధరను నిర్ణయించి, వారం రోజుల్లో డబ్బులు చెల్లిస్తామంటూ కడతా, విత్తనం ధర వివరాలను పొందుపరిచారు. ప్రస్తుతం ఒప్పంద ధర కన్నా ఎర్ర జొన్న ధర పెరిగితే మాత్రం రైతులు గ్రామాల వారీగా వేలం వేసుకోవచ్చంటూ ఒప్పంద పత్రం చివరలో మెలిక పెట్టడంతో రైతులు పునరాలోచనలో పడుతున్నారు. గత సంవత్సరం క్వింటాలుకు 3,500 నుంచి 4వేల ధర పలకగా, ఈ ఏడాది కేవలం 3000గా నిర్ణయించి ఒప్పంద పత్రాలు రాసుకోవడం గమనార్హం.

నేడు జానకంపేట్ ఆలయంలో వేలంపాట

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జానకంపేట్ శివారులో గల శ్రీ లక్ష్మీనరసింహస్వామి జాతర సందర్భంగా దేవాలయం వద్ద కొబ్బరికాయలు, నవధాన్యాలు, లడ్డు, పులిహోర అమ్ముకునేందుకు, సైకిల్ స్టాండ్ నిర్వాహణకై సోమవారం ఉదయం 10 గంటలకు దేవాలయ ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు దేవాలయ ధర్మదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి గింజపల్లి వేణు ఆదివారం తెలిపారు. ఆసక్తి గల వారు వేలంపాటలో పాల్గొనాలని తెలిపారు.

రేపటి నుంచి గ్రామసభలు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సంతోష్ కుమార్ తెలిపారు. ఈ నెల 21 నుంచి 24 వ తేదీ వరకు మండలంలోని 27 గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సర్వే కోసం వచ్చినప్పుడు సంబంధిత పొలాల రైతు అందుబాటులో లేకపోతే, అధికారులు తాము తయారు చేసిన లిస్టును ప్రకటించకముందే, ఆయా గ్రామ సభల్లో ఆ జాబితాను ప్రకటిస్తారని, ఆ సమయంలో మిస్సయిన రైతులు ఆ జాబితాను పరిశీలించి, ఏదైనా సమస్య ఉంటే అధికారులకు చెప్పవచ్చని సూచించారు. అప్పుడు వాళ్ల పరిశీలించి, సమస్యలను సరిచేస్తారని పేర్కొన్నారు. ఈ గ్రామ సభల ద్వారా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేయడానికేనని తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

- 22 ఏండ్ల తర్వాత ఘనమైన వసంతోత్సవం



నవతెలంగాణ-భీంగల్ రూరల్

భీంగల్ పట్టణానికి చెందిన శ్రీ భారతీ విద్యాలయం ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన 2003-04 ఎస్ఎస్‌సి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం లింబాద్రిగుట్టకు వెళ్లే మార్గంలో గల దశాగౌడ్ ఫామ్‌హౌస్‌లో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ కవి కంకణాల రాజేశ్వర్ అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గురువులకు పూర్వ విద్యార్థులు పూలు చల్లుతూ ఘన స్వాగతం పలికారు. చదువుల తల్లి సరస్వతి దేవి, పాఠశాల వ్యవస్థాపకులు దివంగత అభిసింగ్ జయంత్‌రావు చిత్రపటా లకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జయంత్‌రావు మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం పూర్వ విద్యార్థులు గురువులందరికీ శాలువా కప్పి జ్ఞాపికను బహుకరించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. 'తండ్రికీ, బిడ్డకు రక్త సంబంధం ఉంటుంది. గురు శిష్యులకు ఆత్మబంధం ఉంటుంది. రక్త బంధం, పేగు బంధం కన్నా ఆత్మబంధం మిన్న' అని తెలిపారు. పేగు బంధంలో స్వార్థం ఉండొచ్చు కానీ, గురుశిష్య బంధంలో మాత్రం త్యాగగుణం ఉట్టిపడుతుందని చెప్పారు. కొన్ని సందర్భాల్లో తల్లిదండ్రులు గురువులను మరిచిపోవచ్చు. కానీ శిష్యులు మాత్రం గురువులను సదా గుర్తుంచుకుంటారని, అందుకే రక్త బంధం కన్నా ఆత్మ బంధం మిన్నా అంటారని తెలిపారు. కుటుంబ సభ్యులతో సహా సాయంత్రం వరకు అమితానందంగా గడిపారు. పూర్వ విద్యార్థుల ఆటపాటలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కంకణాల రాజేశ్వర్, బొదిరె అశోక్, మేస రాజేశ్వర్, అభిసింగ్ సంగీత, బద్రి జలజ, కవిత, వెంకట్రావు, ప్రకాష్, శారద, దర్ల బాబుల్, రాజేంద్ర బాబు, అమర్ రావు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థుల ప్రతినిధులు నిచ్చెం శ్రీకాంత్, జంబుక శ్రీనివాస్, చెక్కల లిం బాద్రి, బొదిరె నరేష్, గుండెం మనోజ్, కుందారం ఈశ్వరి, శెట్టి స్వాతి, కవిత, స్వరూప, బిల్ల హరిత, కొడిగెల శ్రీధర్, నాయుడు శ్రీనివాస్, ఆరె నవీన్, మంద వినోద్, శాంతిలాల్, జి.లావణ్య, ఎం.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. కార్య క్రమానికి కంకణాల రాజేశ్వర్ వ్యాఖ్యాతగా వ్యవహరించి సభను రంజింపచేశారు.

నిధులు తీసుకొచ్చి.. పసుపు రైతులకు న్యాయం చేస్తా

- జాతీయ పసుపు బోర్డు అధ్యక్షులు పల్లె గంగారెడ్డి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

జాతీయ పసుపు బోర్డు అధ్యక్షులుగా నిధులు తీసుకొచ్చి పసుపు పండించే రైతులకు న్యాయం చేస్తానని పసుపు బోర్డు జాతీయ అధ్యక్షుడు పల్లె గంగారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మనోహరాబాద్ గ్రామంలోని జేఎంకేపిఎం రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మనోహరాబాద్ గ్రామంలోని పసుపు రైతుల ఉత్పత్తిదారుల సంఘాన్ని సందర్శించి తెలంగాణ రాష్ట్రంలో మన నిజామాబాద్ జిల్లాలో మొట్టమొదటి టర్మరిక్ క్లస్టర్ మనోహరాబాద్ గ్రామంలో నెలకొల్పడం సంతోషంగా ఉందని అన్నారు. భవిష్యత్తులో పసుపు పండించే రైతులకు పసుపు బోర్డు ఏర్పాటుతో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ముఖ్యంగా పసుపు రైతులు పసుపును విలువ ఆధారిత వస్తువు చేసి మార్కెటింగ్ చేసుకునేలా ఇట్లాంటి రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఎంతో దోహదపడతాయని తెలియజేశారు. ఇలాంటి సంఘాలను ప్రోత్సహించడానికి మోడీ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ప్రకృతి పర్యావరణ సంస్థ చైర్మన్ జయశ్రీ, జేఎంకేపిఎం రైతు ఉత్పత్తిదారుల సంఘం, భూమి విరాళ దాత ములుగు హిమగిరి రావు, డైరెక్టర్లు పాట్కారి తిరుపతిరెడ్డి, పారిశ్రామికవేత్త కూకట్పల్లి రామారావు, ఐదు గ్రామాల ఎఫ్‌పిఓ రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాతీయ పసుపు బోర్డు అధ్యక్షులు పల్లె గంగారెడ్డి

కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటా

- ఎమ్మెల్సీ కవితను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-మోపాల్

జిల్లా కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఆదివారం జిల్లా బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు మాజీ జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్ ఆధ్వర్యంలో మండల బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్సీ కవితను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కమల నరేష్, మాజీ సొసైటీ చైర్మన్ ఉమాపతి రావు, మాజీ నుడా డైరెక్టర్ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు ముత్యంరెడ్డి, భరత్, తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌ఓసి అందజేత



నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని కిసాన్‌నగర్ గ్రామానికి చెందిన నిజాముద్దీన్ ఇటీవల ప్రమాదవశాత్తు యాక్సిడెంట్‌కు గురై తలకు తీవ్ర గాయాలతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా అతని చికిత్స కోసం ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి రూ.2 లక్షలు ఎల్‌ఓసి మంజూరు చేయించారు. ఎల్‌ఓసి కాపీని సంబంధిత కుటుంబ సభ్యులకు ఆదివారం హైదరాబాద్‌లో అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. ప్రశాంత్ రెడ్డి మేలు మర్చిపోలేమని, జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటామని బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. నిజాముద్దీన్‌కు మెరుగైన చికిత్స అందజేయాలని, భుజానికి కావాల్సిన శస్త్ర చికిత్స ఆరోగ్య శ్రీ ద్వారా చేయాలని నిమ్స్ హాస్పిటల్ వైద్యులను ఎమ్మెల్యే కోరారు.

చరిత్ర, సైన్సును నేర్చుకునే వారే కమ్యూనిస్టులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రాజకీయ అంశాలు, చరిత్ర, సైన్సు విషయాలను నేర్చుకోనే దృక్పథాన్ని కలిగిన వారు కమ్యూనిస్టులు మాత్రమేనని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు నర్రా రామారావు అన్నారు. ప్రజల్ని చైతన్యవంతం చేయడంలో కమ్యూనిస్టులు ముఖ్యపాత్ర వహించాలని సూచించారు. సీపీఐ(ఎం.ఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) నిజామాబాద్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కోటగల్లిలో రాజకీయ శిక్షణ తరగతులను ఆదివారం నిర్వహించారు. ఈ క్లాసులకు డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ వెంకన్న అధ్యక్షత వహించారు. జీవ పరిణామం అనే అంశంపై జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు నర్రా రామారావు క్లాసు బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ అంశాలతో పాటు చరిత్ర, సైన్సు విషయాలను కూడా నేర్చుకోనే దృక్పథాన్ని కలిగిన వాళ్ల కమ్యూనిస్టులు మాత్రమేనన్నారు. మనువాద శక్తులు మత విద్వేషాలు రెచ్చగొడుతూ ప్రజల్ని మతం పేరుతో విడదీస్తూ, పీడిస్తున్న ప్రస్తుత తరుణంలో, ప్రజల్ని అప్రమత్తం చేయడంలో ప్రగతిశీల శక్తులు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. అందుకోసం రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. సైన్సు పట్ల, చరిత్ర పట్ల సమకాలీన రాజకీయాల పట్ల ప్రజల్ని చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణా తరగతుల్లో సీపీఐ(ఎం.ఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు సాయన్న, మురళి, నగర కార్యదర్శి ఎం.సుధాకర్, సీఎల్సి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆల్గోట్ రవీందర్, పి.డి.ఎస్.యు జిల్లా ప్రధాన కార్యదర్శి కే.గణేష్, పివైఎల్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సాయిబాబా, మహేష్, వివిధ ప్రజాసంఘాల నాయకులు రాందాస్, లింగం, గంగాధర్, శకుంతల మోహన్, లలిత, నసీర్, సృజన్, మంజుల, శారద తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామారావు

తైక్వాండో ఉచిత శిక్షణ కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వారం రోజులు ఉచిత తైక్వాండో శిక్షణ కేంద్రాన్ని ఆదివారం ఉదయం సిల్వర్ వింగ్స్ స్కూల్ ఆపోజిట్ ప్లే గ్రౌండ్‌లో తైక్వాండో చైర్మన్ బస్వా లక్ష్మీ నరసయ్య చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో జిల్లా కార్యదర్శి మనోజ్ కుమార్, బ్లాక్ బెల్ట్ గంగాధర్, నాగరాజ్, గయాజ్, నేహా, సిద్ధార్థ, గోపికృష్ణ, రుత్విక పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | జనవరి 20, 2025 | www.navatelangana.com

నూతన సర్వసమాజ్ ప్రెసిడెంట్‌కు సన్మానం


సర్వసమాజ్ ప్రెసిడెంట్‌ను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని సర్వసమాజ్ పెర్కిట్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన బచ్చేవాల నవభోజరాజును క్షత్రియ సమాజ్ తరుపున ఆదివారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెర్కిట్ క్షత్రియ సమాజ్ అధ్యకుడు గటడి నారాయణ్, సెక్రటరీ కరతన్ రాజ్ కుమార్, క్యాషియర్ ప్రవీణ్, గటడి గంగా మోహన్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కరక్‌వాడి గ్రామ దేవాలయాల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక


ఎన్నికైన నూతన కమిటీ

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని కరక్ వాడి గ్రామ నూతన దేవాలయాల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఊమ్మాజీ భాస్కరరావు ఆదివారం తెలిపారు. కమిటీ అధ్యక్షుడిగా ఉమ్మాజీ సుధాకర్ రావు, ఉపాధ్యక్షులుగా సంఘంగొల్ల సాయిరాం, నారాయణ, ప్రధాన కార్యదర్శులుగా భీమరైని అశోక్, దొడ్ల ప్రభాకర్, గొల్ల సురేష్, సంఘాల శ్రీకాంత్, సలహాదారులుగా భుజంగరావు, బల్వంత్ రావు, చంద్రరావు, ఉమాజీ భాస్కరరావు, పోచయ్య, రాములు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు, పారిశుధ్య సమస్యలకు
శాశ్వత పరిష్కారం

- మహిళల రక్షణ కోసం భరోసా కేంద్రం
- గత ప్రభుత్వం తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టింది
- అయినా ఇచ్చిన హామీల మేరకు పథకాలు అమలు చేస్తున్నాం
- మంత్రి జూపల్లి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ
- నగరంలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు


భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలో తాగునీరు, పారిశుధ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేలా సుమారు 400 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ వెల్లడించారు. నగరంలో పలు అభివృద్ధి పనులకు ఆదివారం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన భరోసా కేంద్రాన్ని రాష్ట్ర డీజీపీ జితేందర్, కలెక్టర్ రాజీవ్ గాంధీతో కలిసి ప్రారంభోత్సవం చేశారు. బాలికలు, మహిళలకు రక్షణ కల్పించేందుకు ఉద్దేశించిన ఈ కేంద్రం గురించి విరివిగా ప్రచారం నిర్వహిస్తూ, మెరుగైన సేవలు అందించాలని, బాధితులకు అండగా నిలుస్తూ వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించాలని హితవు పలికారు. అనంతరం నిజామాబాద్ నగరంలో మంచినీటి సరఫరా వ్యవస్థను మెరుగుపర్చేందుకు అమృత్ 2.0 పథకంలో భాగంగా రూ.380 కోట్ల వ్యయంతో చేపడుతున్న పనులకు, వరద జలాలు నిలువకుండా చేపడుతున్న స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. గోల్ హనుమాన్ వద్ద నిర్మించిన నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ ఆఫీస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి జూపల్లి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. నగర ప్రజలకు ఇది పండుగ వాతావరణం అని హర్షం వెలిబుచ్చారు. వచ్చే యాభై సంవత్సరాల వరకు కూడా పెరిగే జనాభా అవసరాలను దృష్టిలో పెట్టుకుని తాగునీరు, పారిశుధ్య సమస్య తలెత్తకుండా సుమారు 400 కోట్ల రూపాయల నిధులతో మంచి నీటి సరఫరా వ్యవస్థను మెరుగుపర్చే పనులతో పాటు శానిటేషన్ దుస్థితిని దూరం చేసేలా భూగర్భ డ్రైనేజీ పనులను చేపట్టనున్నట్టు తెలిపారు. ఏడాదిన్నర కాలంలో ఈ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టు ఏజెన్సీలను ఆదేశించారు. తాగునీటి వ్యవస్థను మెరుగుపర్చేందుకే రూ.217 కోట్లు మంజూరు చేయించామని తెలిపారు. ఇందులో కేంద్రం వాటా 33 శాతం కాగా, రాష్ట్ర ప్రభుత్వం 59.23 శాతం నిధులను వెచ్చిస్తోందని, 14వ ఆర్థిక సంఘం ద్వారా 14.97 శాతం నిధులు మంజూరవగా, స్థానిక నగర పాలక సంస్థ 10 శాతం నిధులు భరిస్తుందని వివరించారు. ఈ నిధులతో అలీసాగర్ వద్ద 25 ఎం.ఎల్.డీ సామర్థ్యంతో కూడిన స్టోరేజ్ ట్యాంకులు నిర్మిస్తున్నారని, ప్రతి రోజు 2.5 కోట్ల లీటర్ల నీటిని శుద్ధి చేసి నగర ప్రజలకు రక్షిత జలాలు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న మంచినీటి ట్యాంకులకు అదనంగా ఆయా ప్రాంతాలలో అదనంగా మరో 18 ట్యాంకులను నిర్మిస్తున్నారని అన్నారు. అదేవిధంగా అసంపూర్తిగా ఉన్న భూగర్భ డ్రైనేజ్ పనులను పూర్తి చేసేందుకు మరో 162 కోట్ల రూపాయలను మంజూరు చేయించామని తెలిపారు. గడిచిన పదేళ్లలో స్తంభించిపోయిన అభివృద్ధి పనులను తమ ప్రభుత్వం శరవేగంగా చేపడుతూ, ప్రజలకు మౌలిక వసతులను మెరుగుపర్చే పనులను చేపడుతోందని తెలిపారు. తెలంగాణ ప్రజల ఆత్మబలిదానాలు, త్యాగాలను చూసి చలించిన నాటి యూ.పీ.ఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రం కలను సాకారం చేశారని గుర్తు చేస్తూ, స్వరాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి సంక్షేమ ఫలాలను అందించడమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పాలన సాగిస్తోందని అన్నారు. గత ప్రభుత్వం తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టిన ఫలితంగా ప్రతీ నెల వడ్డీ రూపంలోనే 6500 కోట్ల రూపాయలను తమ ప్రభుత్వం చెల్లించాల్సి వస్తోందని ఆక్షేపించారు. అయినప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు రూ.500 లకే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి పథకాలను అమలు చేస్తోందని గుర్తు చేశారు. రైతులకు లబ్ది చేకూర్చేందుకు 21 వేల కోట్ల రూపాయల పంట రుణాలను మాఫీ చేశామని, మరో 21 వేల కోట్ల రూపాయలతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో మొదటి విడతగా 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని వివరించారు. ఒక్క నిజామాబాద్ అర్బన్ సెగ్మెంట్లోనే ఇందిరమ్మ ఇళ్ల కోసం 175 కోట్ల రూపాయలను వెచ్చించనున్నామని తెలిపారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి పథకాలకు కూడా ప్రభుతం ఈ నెల 26 నుంచి శ్రీకారం చుడుతోందని అన్నారు. కేవలం ఏడాది కాలంలోనే ఇన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసిన తమ ప్రభుత్వం, రానున్న నాలుగేళ్లలో మరింత విస్తృత స్థాయిలో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టనుందని తెలిపారు. ప్రజలు వాస్తవాలను గమనించాలని, ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు పలువురు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని కోరారు. కాగా, ప్రతి ఒక్కరు తమ దైనందిన జీవన శైలిలో మార్పులు చేసుకోవాలని, యోగా, వ్యాయామానికి తప్పనిసరిగా కొంత సమయాన్ని కేటాయిస్తూ ఆరోగ్యాలను పరిరక్షించుకోవాలని మంత్రి జూపల్లి హితవు పలికారు. అనవసర ఆడంబరాలకు పోయి వేడుకల పేరుతో కష్టార్జితాన్ని వృథా చేసుకోకూడని, నిష్ణాతులైన ఉపాధ్యాయులు, నాణ్యమైన బోధన అందిస్తున్న ప్రభుత్వ బడులలో పిల్లలను చదివిస్తూ డబ్బులను ఆదా చేసుకోవాలని జాగ్రత్తలు సూచించారు. ఈ కార్యక్రమాల్లో శాసన సభ్యులు సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ భూపతి రెడ్డి, ధన్పాల్ సూర్యనారాయణ, రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ, జోన్ ఐ.జీ చంద్రశేఖర్ రెడ్డి, ఇంచార్జ్ పోలీస్ కమిషనర్ సింధు శర్మ, నగర మేయర్ దండు నీతూ కిరణ్, నుడా చైర్మన్ కేశ వేణు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, ఐడిసిఎంఎస్ చైర్మన్ తారాచంద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, అదనపు డీసీపీ బస్వారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మంత్రికి మొక్కను అందజేస్తున్న ఇంచార్జి సీపీ


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి

డీవైఎఫ్ఐ రోటరీ నగర్ ఏరియా కమిటీ ఎన్నిక

- నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి


సమావేశంలో పాల్గొన్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డివైఎఫ్ఐ) రోటరీనగర్ ఏరియా కమిటీని పదిమంది సభ్యులతో ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరేష్ మాట్లాడుతూ.. నిరుద్యోగుల సమస్యలపైన అనేక పోరాటాలు చేసే ఏకైక సంఘం డివైఎఫ్ఐ అని తెలిపారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెలంగాణ ఏర్పాటైందని, కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో యువతను అణిచి వేయడంతో ప్రభుత్వానికి నిరుద్యోగులు బుద్ధి చెప్పారని అన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వమైనా నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే వార్షిక జాబ్ క్యాలెండర్‌ను తూచా తప్పకుండా అమలు చేయాలన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీనీ వెంటనే కనీసం 3000 రూపాయలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యువతకు ఉద్యోగ అవకాశాలు ఉపాధిని కల్పించాలని, లేకపోతే భవిష్యత్తులో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాతంత్ర ఉద్యమ నాయకులు నల్వాల నర్సయ్య, సతీష్, రోటరీ నగర్ ఏరియా కార్యదర్శిగా సాయికుమార్, అధ్యక్షులుగా కృష్ణ, దుర్గాప్రసాద్, నవనీష్, రాజ్‌కుమార్, కార్తీక్, మహేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

పోతంగల్‌లో రెండు ఆవులు సజీవ దహనం

- ఆరు ఆవులకు తీవ్ర గాయాలు
- షార్ట్ సర్క్యూట్‌తో పశువుల కొట్టం దగ్ధమవడంతో ఘటన


సజీవదహనమైన ఆవు

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని పోతంగల్ గ్రామంలో శనివారం రాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా పశువుల కొట్టం దగ్ధమవడంతో రెండు ఆవులు సజీవ దహనం కాగా.. ఆరు ఆవులకు మంటలు తగిలి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు చిలుక సాయిబాబా గత కొన్ని రోజుల క్రితం ఆవులను కొనుగోలు చేసి పెంచుతున్నాడు. ప్రమాదవశాత్తు శనివారం రాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా పశువుల కొట్టానికి నిప్పంటింది. స్థానికులు ఫైర్ ఇంజన్‌కు ఫోన్ చేయగా వచ్చేసరికి పశువుల కొట్టంతో పాటు అందులో ఉన్న రెండు ఆవులు సజీవ దహనమయ్యాయి. కొట్టం బయట కట్టిన ఆరు ఆవులకు మంటలు తగలడంతో తీవ్రగాయాల పాలయ్యాయి. సుమారు మూడు నుండి నాలుగు లక్షల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు సాయిబాబా ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు ప్రభుత్వం స్పందించి నష్టపరిహారాన్ని అందించాలని కోరుతున్నాడు.

నాగిరెడ్డి పేటలో పల్లెనిద్ర



పల్లెనిద్రలో పాల్గొన్న నాయకులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో శనివారం రోజు రాత్రి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం రోజు రాత్రి ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెట్టాల్ రెడ్డి, కోఆర్డినేటర్ సభ్యులు నరసింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సాయగౌడ్, మండల ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, మండల మైనార్టీ అధ్యక్షులు ఇమామ్, ఏఎంసి డైరెక్టర్ నగేష్, ఎల్లారెడ్డి నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షుడు గులాం, మన్నే వెంకటి, యాదగిరి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


మాల తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ మండల కమిటీ ఎన్నిక


ఎన్నికైన నూతన కమిటీ

నవతెలంగాణ-వర్ని(చందూర్)

మాల తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ మండల కమిటీని ఆదివారం బోధన్ డివిజన్ సెక్రటరీ తుకారం, జిల్లా సెక్రటరీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బేగరి సాయిలు (చందూర్), జనరల్ సెక్రటరీగా బేగరి సాయిలు (ఘన్‌పూర్), కోశాధికారిగా మేడిపల్లి సాయిలు (చందూర్), ఉపాధ్యక్షులుగా నీరడి చరణ్ (లక్ష్మపూర్), ఆర్గనైజేషన్ సెక్రటరీగా నీరడి సాయిలు (ఘన్‌పూర్), ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎస్.నరేష్ (చందూర్), నీరడి బాలయ్య (లక్ష్మాపూర్), తోలుదొడ్డు గంగాధర్ మెకానిక్ (ఘన్‌పూర్), ప్రచార కార్యదర్శిగా ఇందూర్ సాయిలును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు



నవతెలంగాణ-భిక్కనూర్ (రాజంపేట్)

రాజంపేట మండలంలోని బసవన్నపల్లి, ఆర్గొండా గ్రామాల శివారులో అక్రమంగా పేకాటాడుతున్న వారిపై పోలీసులు దాడి నిర్వహించి ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. వారి వద్ద నుండి 7సెల్‌ఫోన్‌లు, రూ.58,350 నగదు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. మండలంలో అక్రమంగా పేకాటాడితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పిచ్చి మొక్కల మధ్యనే మహిళా మండలి భవనం

సమావేశాలకు ఇబ్బందులు పడుతున్న మహిళలు.. పేర్ పేరుతో నాపరాళ్లు మాయం


మహిళ మండలి భవనం చుట్టూ ఏపుగా పిచ్చిమొక్కలు

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలం పెగడాపల్లి గ్రామంలోని మహిళ మండలి భవనం పిచ్చిమొక్కల మధ్య కళావిహీనంగా తయారయ్యింది. భవనం చుట్టూ పిచ్చి మొక్కలు పెరగడంతో విషకీటకాలతో ప్రమాదకరంగా మారింది. కనీసం భవనం లోనికి వెళ్లడానికి వీలు లేకుండా పిచ్చిగడ్డి పెరిగిపోయింది. దాంతో మహిళలు సమావేశాలు నిర్వహించుకోడానికి ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా భవనం నిరుపయోగంగా ఉండడంతో విష సర్పాలు సంచరిస్తున్నాయని మహిళలు తెలిపారు. భవనం శిథిలావస్థకు చేరినా ఎవరూ పట్టించుకోవడం లేదని మహిళలు వాపోతున్నారు. సమావేశాలకు స్థలం లేకపోవడంతో పక్కన ఉన్న రైతువేదికలో గల చిన్న గదిలో మహిళలు సమావేశాలు జరుపుకుంటున్నారు.

గ్రామంలో మొత్తం 64 మహిళ స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఒకేసారి వందల మంది మహిళలు సమావేశాలు జరుపుకోవాలంటే రైతువేదిక చిన్న గది ఇరుకుగా మారిందని సమావేశాలకు సంబంధించిన ఫోటోలు అధికారులకు పంపాలంటే కష్టంగా మారిందని వీఓఏలు ఆవేదన వ్యక్తం చేశారు.

రిపేరు పేరుతో నాపరాళ్లు మాయం..

మహిళ మండలి భవనం శిథిలావస్థకు చేరడంతో దానిని మరమ్మతులు చేయించాలని గత ప్రభుత్వ హయాంలోని స్థానిక ప్రజాప్రతినిధులను మహిళలు కోరారు. దాంతో మహిళ మండలి భవనాన్ని మరమ్మతులు చేయించి ఇస్తామని చెప్పి స్థానిక ప్రజాప్రతినిధి మహిళ మండలి భవనంలోని నాపరాళ్లను తొలగించి తీసుకెళ్లినట్లు మహిళలు తెలిపారు. పలుమార్లు మరమ్మతుల విషయమై అడిగితే రేపు, మాపు అంటు కాలం వెళ్లదీసిన ఆ ప్రజాప్రతినిధి దానిని ఇప్పటికీ మరమ్మతులు చేయించలేదని మహిళలు తెలిపారు. దాంతో మహిళ మండలి భవనం ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరి విషకీటకాలకు నిలయంగా మారింది. అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానిక మహిళ సంఘాల నాయకులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఇప్పటికైనా స్పందించి మహిళ మండలి భవనాన్ని మరమ్మతులు చేయించి మహిళ సంఘాల సమస్య పరిష్కరించాలని మహిళలు కోరుతున్నారు.

ఇరుకు గదిలో మీటింగ్ పెడుతున్నాం

మహిళ మండలి భవనం కూసోడానికి అనుకూలంగా లేకపోవడంతో రైతువేదికలోని చిన్న గదిలో మీటింగ్ పెట్టుకుంటున్నాం. దాంతో మీటింగ్ ఫోటోలు తీసుకోడానికి ఇబ్బందులుగా మారింది. సంవత్సరాల నుంచి భవనం రిపేర్ చేస్తామని చెప్పిన లీడర్లు ఎవరు పట్టించుకోవడం లేదు. దయచేసి తొందరగా రిపేర్ చేసి ఇవ్వాలని కోరుతున్నాం.
- లక్ష్మి, వీఓఏ, పెగడాపల్లి.

ఏండ్లయినా రిపేర్ చేస్తలేరు

మహిళ మండలి భవనం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి అక్కడ వెళ్లడానికి వీలులేకుండా తయారయింది. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. రిపేర్ చేస్తామని రాళ్లు తీసేశారు. ఇంత వరకు రిపేర్ చేయలేదు. దాంతో అది పనికిరాకుండా తయారయింది. రైతువేదిక గదిలో మీటింగ్ పెట్టుకోవడం ఇబ్బందిగా మారింది. దయచేసి ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సార్ మా సమస్య పట్టించుకోవాలని కోరుతున్నాం.
- అనిత, వీఓఏ, పెగడాపల్లి.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-భీంగల్ రూరల్

భీంగల్ పట్టణానికి చెందిన బాలికల ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన 1995-96 ఎస్ఎస్‌సి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం పట్టణ కేంద్రంలోని జేబీఎస్ గార్డెన్‌లో వేదికగా చేసుకొని 29 వసంతాల తర్వాత కలుసుకొని వైభవోపేతమైన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. హైమద్, శ్రీనివాస్, లక్ష్మణ్ గురువులకు పూర్వ విద్యార్థులు పూలు చల్లుతూ ఘన స్వాగతం పలికారు. వివిధ కారణాలతో మృతిచెందిన స్నేహితుల మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం పూర్వ విద్యార్థులు గురువులందరికీ శాలువాకప్పి జ్ఞాపికను బహుకరించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో 1995-96 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులందరూ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని లొంక తండా గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్న గుజ్జుల్ తండాకు చెందిన సరియాకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోహన్ నాయక్ అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



వాహనాల తనిఖీ


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రమైన తాడ్వాయిలో ఆదివారం ఎస్ఐ సంజీవ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్ ధరించక, లైసెన్సు లేక, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారికి పరీక్షలు జరిపి పలువురికి జరిమానాలు విధించారు. వాహనదారులు హెల్మెట్‌తో పాటు లైసెన్సు ఉండి వాహనాలు నడపాలని పలువురికి సూచించారు. ఈ తనిఖీలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.